సిసిఏకు క్రీడల శాఖ మంత్రి క్రికెట్ కిట్స్ పంపిణీ

విశాలాంధ్ర-చింతూరు : చింతూరు క్రికెట్ అసోసియేషన్ (సిసిఏ) క్రీడాకారులకు క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి క్రికెట్ కిట్లను పంపారు. ఆ క్రికెట్ కిట్లను డిడిఓ విజయ్‌కుమార్ గురువారం చింతూరు క్రికెట్ గ్రౌండ్‌లో సిసి అసోసియేషన్ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా క్రికెట్ కిట్లను పంపించిన స్పోర్ట్స్ మినిస్టర్ రాంప్రసాద్ రెడ్డికి, తమకు అందజేసిన డిడిఓకి చింతూరు క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కణితి గణేష్, బుచ్చిరాజు, పాల్వంచ రవి, మడివి రాజు, షాహిద్, స్టీఫెన్, బిట్టు, ప్రదీప్, ప్రవీణ్, గంగు తదితర సభ్యులు పాల్గొన్నారు.

పిపిపి విధాన జివో నెం 590, 107, 108లు రద్దు చేయాలి

సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన

విశాలాంధ్ర-పాడేరు : రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు పిపిపి విధానాన్ని జివో నెం 590, 107, 108లు రద్దు చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా సిపిఐ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అన్నారు. గురువారం పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ నూతన వైద్య కళాశాలల్లో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్షిప్ (పిపిపి) విధానాన్ని అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత ప్రమాదకరమైనదన్నారు. ఈ విధానం సామాజిక న్యాయం, విద్యార్థుల హక్కులు, ఉపాధి భద్రత, పేద, మధ్యతరగతి వర్గాల భవిష్యత్తుపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు చూపుతుందన్నారు. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలకు విరుద్ధమై, సామాజిక వర్గాల అభ్యున్నతికి భంగం కలిగించే చర్య అని అన్నారు. రాష్ట్రంలోని 10 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేటీకరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జీవో నంబర్ 590ని జారీ చేయడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని, ఇది కేవలం వైద్య విద్య వెనుక ఉన్న సామాజిక లక్ష్యాన్ని కాకుండా, ఆ విద్యకు అనుబంధమైన ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందే పేద ప్రజల వైద్య సేవలకు కూడా దూరం కలిగిస్తుందన్నారు. ప్రభుత్వ రంగంలోని స్థిరమైన ఉద్యోగ అవకాశాలు నిరుద్యోగ యువతకి అందకుండా పోతాయి. ప్రజల ఆరోగ్య హక్కులు, ప్రభుత్వ వైద్య విద్యా వ్యవస్థలు విచ్ఛిన్నమవుతాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం 590 విడుదల చేయడం ద్వారా మార్కాపురం, మదనపల్లి, ఆదోని, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం పాడేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి పరిధిలోకి తీసుకురావడం దుర్మార్గమన్నారు. గత వైసిపి ప్రభుత్వం కొత్తగా 17 వైద్య కళాశాలల ఏర్పాటుతో రాష్ట్రంలో వైద్య సీట్ల సంఖ్య పెరుగుతుందని, వేలాది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశించడం జరిగిందన్నారు. కాని గత ప్రభుత్వం జివో నెం 107, 108లు తీసుకొచ్చి సెల్ఫ్ ఫైనాన్స్ ద్వారా ఆయా మెడికల్ కాలేజీలలో సీట్లను భర్తీ చేయాలని నిర్ణయించింది. జివో నెం 107, 108 రద్దు చేయాలని వామపక్ష, విద్యార్థి, యువజన సంఘాలు తీవ్రంగా ఉద్యమించాయన్నారు. యాజమాన్య కోటా సీటుకు రూ.12 లక్షలు, ఎన్ఆర్ కోటా సీటుకు రూ.20 లక్షలు వసూలు చేస్తున్నారంటూ ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా విమర్శించాయి. కాని అధికారం చేపట్టాక అదే కూటమి పార్టీలు జివోలు 107, 108ను రద్దు చేయకపోగా వైద్య విద్యను పిపిపి విధానంలో పూర్తిగా ప్రైవేటుకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకోవడం అన్యాయమన్నారు. మెడికల్ కాలేజీల పిపిపి విధానం వలన ప్రభుత్వ భూములు, భవనాలు, వసతులు, కాలేజీల ఆసుపత్రులు దాదాపు 60 ఏళ్లపాటు ప్రైవేటు సంస్థల చేతులల్లోకి వెళ్ళిపోతాయి. మొత్తం 1,500 సీట్లు త్వరగా అందుబాటులోకి వస్తాయని, అందులో 75 శాతం సీట్లు కన్వీనర్ కోటా కింద పేదలకు లభిస్తాయని ప్రభుత్వం చెబుతున్నా, 25 శాతం యాజమాన్య కోటా సీట్లను (375 సీట్లు) ఒకొక్కటి రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు విక్రయించే అవకాశం ఉందన్నారు. దీంతో పేద, మధ్యతరగతి వర్గాలకి వైద్య విద్య అందని ద్రాక్షగా మారడమేగాక వైద్యవిద్యలో నాణ్యత, పారదర్శకత లోపించే ప్రమాదముందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 70 శాతం పడకలు ఉచిత వైద్యసేవల కోసం అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం చెబుతున్నా, మిగిలిన 30 శాతం చెల్లింపు పడకల కారణంగా అత్యవసర పరిస్థితులలో పేదలకు చికిత్స అవకాశాలు తగ్గే ప్రమాదముంది. ప్రజలకు ఆరోగ్య సేవ లోపిస్తుంది. పేద, రిజర్వేషన్ వర్గాలకు వైద్య విద్య సీట్లు అందకుండా పోతాయి. ఇది ప్రభుత్వ ఉద్యోగ భద్రతను, రిజర్వేషన్ హక్కులను బలహీనపరచడమే అవుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి జివో నెం 590 తక్షణమే ఉపసంహరించాలని, గత ప్రభుత్వం తీసుకొచ్చిన జివోలు 107, 108లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ నూతన వైద్య కళాశాలలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించి, నిర్వహించాలని కోరారు. వాటిని శాశ్వత ప్రభుత్వ, ప్రజా ఆస్తులుగా నిలిపి, పేద ప్రజల వైద్య విద్య హక్కును, సామాజిక న్యాయాన్ని, భవిష్యత్ తరాల అవకాశాలను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వైద్యవిద్యను ప్రైవేటు శక్తుల కబంధ హస్తాల నుండి కాపాడుకునేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నిరంతరం పోరాటం చేస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు కూడ రాధాకృష్ణ, పెట్ల పోతురాజు, సింహాచలం, ఉల్లి సూరిబాబు, అమర్, దేవుళ్ళు తదితరులు పాల్గొన్నారు.

దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

దానధర్మ ట్రస్ట్ ప్రతినిధి డివిడి ప్రసాద్

విశాలాంధ్ర-కొయ్యూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం పరిధి పలు గ్రామాల్లో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ మరియు దాతల సహకారంతో సుమారు 500 మంది నిరుపేదలకు వృద్ధులకు ట్రస్ట్ ప్రతినిధి డివిడి ప్రసాద్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో మహిళలు వృద్ధులు చిన్నపిల్లలు చలికి తాళలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చలి నుండి కొద్దిపాటి ఉపశమనం కలిగించే చర్యల్లో భాగంగా దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో దుప్పట్లను సేకరించి గిరిజన ప్రాంతాల్లో పంపిణీ చేస్తున్నట్లు ప్రసాద్ తెలిపారు. మారుమూల గ్రామాల్లో ఉన్న వృద్ధులు మహిళల అభ్యర్థన మేర ఆయా ప్రాంతాల్లో పంపిణీకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమాలకు దాతలు సహకరించి విరాళాలు అందజేయవలసిందిగా కోరారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ మానుకోవాలి

సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర-రంపచోడవరం : ప్రభుత్వ కళాశాలలను పిపిపి పేరుతో ప్రైవేటీకరణ మానుకోవాలని దీనికి నిరసనగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపులో భాగంగా రంపచోడవరంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి ఐటిడిఏ వరకు సిపిఐ కార్యకర్తలు నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జుత్తు కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెట్టి మరో దోపిడీకి తెర లేపిందని నిరుపేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా అన్యాయం చేస్తుందని అన్నారు ఎన్నికల ముందు ప్రజలకు నేను అండగా ఉంటానని కుర్చీ ఎక్కిన చంద్రబాబు పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని అన్నారు జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు గోముదుర్గ మాట్లాడుతూ పేదలకు విద్య అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆశ్రమ పాఠశాలలో నేటికీ సరైన విద్య అందడం లేదని కూటమి నాయకులు కార్పొరేట్ల ముందు మోకరిల్లుతున్నారని అన్నారు డివిజన్ నాయకులు దినేష్ రెడ్డి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి లేక సరైన రోడ్డు సదుపాయం లేక నేటికీ వైద్యం పూర్తిగా అందడం లేదని పెన్షన్లు లేక కొంతమంది గిరిజనులకు జీవనం కూడా కష్టంగా ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ జిల్లా నాయకులు కత్తుల శ్రీనివాస్ రెడ్డి లింగారెడ్డి సోమిరెడ్డి బంద్రెడ్డి చంద్రరావు రాంబాబు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేద గిరిజనులకు ఉన్ని దుస్తులు, నిత్యవసర సరుకుల పంపిణీ

శాన్ చారిటీ ఫౌండర్, హరిత రిసార్ట్స్ మేనేజర్ అప్పలనాయుడు

విశాలాంధ్ర-చింతపల్లి : శీతాకాలం కారణంగా ఆంధ్ర కశ్మీర్ లంబసింగి ప్రాంతంలో చలికి వణుకు తున్న నిరుపేద వి వీ టీ జీ తెగ గిరిజనులకు ఉన్ని దుస్తులతో పాటు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందని శాన్ చారిటీ ఫౌండర్, హరిత రిసార్ట్స్ మేనేజర్ సూరెడ్డి అప్పల నాయుడు అన్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతంగా పేరొందిన లంబసింగి ప్రాంతంలోని చెరువుల వెనం కొండ పై నివసిస్తున్న 35 పీవీటీజీ తెగ నిరుపేద గిరిజన కుటుంబాలకు విజయవాడ కు చెందిన గుంటూరు జగదీష్, రమేష్ కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో స్థానిక శాన్ ఛారిటీ ఫౌండర్, ప్రభుత్వ పర్యాటకశాఖ మేనేజర్ సూరెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో పంచాయతీ మాజీ సర్పంచ్ కొర్ర రఘునాథ్, వైసీపీ సీనియర్ నాయకుడు రావుల నూకరాజులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకంగా మన్య ప్రాంతం అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ఈ ప్రాంతంలో అనేకమంది గిరిజనులు నేటికీ నిరుపేదలుగానే ఉన్నారన్నారు. కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోని ఎంతోమంది నిరుపేదలు నేడు శీతాకాలం కారణంగా చలికి వణుకుతూ జీవిస్తున్నారన్నారు. అటువంటి ఈ పర్యాటక ప్రాంతాన్ని సందర్శించేందుకు మైదాన ప్రాంతాల నుంచి ఎంతోమంది వస్తున్నారన్నారు. వారిలో చాలామంది ఉదార స్వభావం కలిగి ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగా విజయవాడకు చెందిన జగదీష్, రమేష్ కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో తన ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఉదార స్వభావం కలిగిన వారంతా ఇటువంటి మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చెరువుల వేనం గ్రామానికి చెందిన గిరిజనులు పాల్గొన్నారు.

రూ. 13 లక్షలతో ప్రైమరీ పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-హుకుంపేట : హుకుంపేట పంచాయతీ దాలి గుమ్మడి గ్రామంలో సమగ్ర శిక్ష అభియాన్ స్కీమ్ ద్వారా 13లక్షల రూపాయలతో మండల్ పరిషత్ ప్రైమరీ పాఠశాల నిర్మాణం పనులను ప్రారంభించడం జరిగింది. ఈ నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ సమీడ వెంకటపూర్ణి మ,ఎంపీటీసీ కొమ్మ రమ్మ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, సాధ్యమైనంత త్వరగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని, వారు కోరారు. ఈస్కూల్ సిదిలావస్థకు చేరుకున్న కారణంగా స్కూల్ కోసం గతంలో ఎన్ని మర్లు అధికారులు దృష్టిలో తీసు కెళ్లిన ఫలితం లేకపోయిందన్నారు. మా హయంలోనే ఈ స్కూలు మంజూరవడం మాకు ఎంతో ఆనందించ దగ్గ విషయం అని సర్పంచ్, ఎంపీటీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్ ఆర్ సిపి మండల అధ్యక్షులు పాంగి అనిల్, టీచర్స్ సుంక్రి బొంజన్న, కూడా శకుంతల, స్కూల్ చైర్మన్ సోవ్వేరి కృష్ణకాంత్, కాంట్రాక్టర్ వంతాలరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్షీణిస్తున్న ఉష్ణోగ్రతలు... పెరిగిన చలి తీవ్రత

- దట్టంగా కమ్ముకుంటున్న పొగ మంచు
- సింగిల్ డిజిట్‌లో కొనసాగుతున్న ఉష్ణోగ్రతలు
- చలికి వణుకుతున్న మన్య ప్రాంత ప్రజలు... - ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీ

విశాలాంధ్ర-చింతపల్లి : అల్లూరి జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌లో కొనసాగుతున్నాయి.

గడచిన వారం రోజులుగా మన్య ప్రాంతంలో మంచు దట్టంగా కురుస్తూ, శీతల వాతావరణం కారణంగా మన్య ప్రాంత ప్రజలు గజగజ వణుకు తున్నారు. సాయంత్రం 6 గంటల నుండి మన్య ప్రాంతంలో పొగ మంచు దట్టంగా కురుస్తుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. వాహనదారులు ఉదయం ప్రయాణం చేయాలన్నా, సాయంకాలం ప్రయాణించాలన్నా వాహనాలకు లైట్లు వేసుకుని ప్రయాణం చేయడం తప్పనిసరిగా తయారైంది. లేదంటే ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు సంభవించే అవకాశాలు లేకపోలేదు. ఈ క్రమంలో గడచిన రెండు రోజులుగా చింతపల్లిలో 7.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు చలి తీవ్రత పెరిగింది. రాబోవు రోజుల్లోనూ ఈ ఉష్ణోగ్రతలు ఇదే విధంగా కొనసాగే అవకాశం ఉందని, చలి తీవ్రత కూడా మరింత పెరిగే అవకాశం లేకపోలేదని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడిఆర్, వాతావరణ విభాగ నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

పసుపు పంటలను గిరిజన సంఘం పరిశీలన

విశాలాంధ్ర-హుకుంపేట : మండలంలో గల జి కె మండ పంచాయతీ గడ్డిమర్రి గ్రామంలో గురువారం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర, మండల కార్యదర్శి టి క్రిష్ణరావు స్థానిక గ్రామస్తులు పండిస్తున్న పసుపు పంటలను పరిశీలించారు. అనం తరం విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసి ప్రాంతంలో పండిస్తున్న పసుపు కిలో 200 రూ" కొనుగోలు చేస్తే తప్పా రైతులకు గిట్టుబాటు ధర రాదన్నారు. ప్రభు త్వం పసుపు కొనుగోలు బోర్డును ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొను గోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతు లకు ప్రభుత్వం ప్రాసెసింగ్ యూనిట్లు పంపిణీ చేయాలని వారు అన్నారు. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని ఎత్తివేసి ఉపాధిహామీ పథ కంగా మార్చడాన్ని ఆదివాసి గిరిజ న సంఘం తీవ్రంగా ఖండి స్తుందని వారన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పార్లమెంట్ సమావేశంలో సవరించి, వాటిని ఒక పథకంగా మార్చడా న్ని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కమిటి తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నా రు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం వాటా తగ్గించుకుని రాష్ట్ర వాటాలు 40 శాతానికి పెంచి ఉపాధి హామీ పథకన్నీ ఎత్తివేయాలని కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వ ప్రయత్నాన్ని ప్రజలు మేలుకొని అడ్డు కోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ చట్టం తొలగిస్తే ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి లేక వలసలు పెరిగిపోతాయ ని వారు అన్నారు. తద్వారా అంతరించిపోతున్న గంజా యి తదితర మాదక ద్రవ్యాల విక్రయాలు కూడ పెరిగే ప్రమాదం ఉందని వారు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన చట్టాలైన జివో నంబర్ 3 తదితర హక్కులు తొలగించడంతో ఆదివాసీ ప్రజలకు నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా ఉపాధి హామీ చట్టం రక్షణకు పోరాటం చెయ్యాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక పసుపు రైతులు పాల్గొన్నారు.

గిరిజన కానిస్టేబుల్‌కి పంచాయతీ నాయకులు, ప్రజలు ఘన సత్కారం

విశాలాంధ్ర-జీకే వీధి : మండలంలోని ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగము పొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర హోమ్ మినిస్టర్ అనిత ప్రశంసలు పొంది. తన గ్రామము ఏలుగురాతిబందాకు 3 కోట్ల 90 లక్షల రోడ్డు నిర్మాణాం మంజూరు చేయించుకున్న లకే బాబురావుకు తన సొంత గ్రామం ఏలుగు రాతిబందాలో గ్రామస్తులు తల్లిదండ్రులు ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులు, కానిస్టేబుల్ బాబురావు, వివిధ పార్టీల నాయకులు అందరూ కలిసి ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి ఫోటోలకు పాలభిషేకం చేశారు. గ్రామం నుంచి మొట్టమొదటిగా ఉద్యోగం సాధించిన బాబురావు స్వగ్రామానికికి రావడం వల్ల గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కాకూరు శేఖర్, రీమల పాల్, లకే రాము, ఉప సర్పంచ్ గుమ్మడి రాజబాబు, రాంబాబు. ముక్కలీ మహేష్, భారతా ఆదివాసి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మొట్టడం రాజబాబు లకే రామచంద్రుడు. గ్రామస్తులు పాల్గొన్నారు.

కళాకారులకందని బకాయి సొమ్ము

తక్షణమే బకాయి సొమ్ము చెల్లించాలని కళాకారుల ఆవేదన

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : గత 2018 సంవత్సరంలో కళాకారులు ప్రదర్శించిన జన్మభూమి, గ్రామదర్శిని వంటి బకాయి సొమ్ము ఇప్పటివరకు అందక పండగ రోజు కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని కళాకారులు అప్పలరాజు, ఈశ్వరరావు శ్రీను, అచ్చిబాబు, మల్లేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో2018 సంవత్సరం చంద్రబాబు నాయుడు హయంలోనే జన్మభూమి, గ్రామదర్శిని కార్యక్రమాలు కళాకారులు రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శించారని చెప్పారు. అప్పట్లో కళాజాత ద్వారా కార్యక్రమాలు నిర్వహించేందుకు కళాకారులకు అడ్వాన్స్ సొమ్ము ఇవ్వకపోయినప్పటికీ కూడా కళాకారులు కళాజాత ద్వారా కార్యక్రమాలు నిర్వహించేందుకు బయట వడ్డీలకు అప్పులు చేసి కళాజాత కార్యక్రమాలు నిర్వహించామని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 7 సంవత్సరాలు గడిచినప్పటికీ కూడా ఇప్పటివరకు బకాయి సొమ్ము చెల్లించకపోవడం సరికాదని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాకారులు కళా పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. గతంలో నిర్వహించిన గ్రామదర్శిని, జన్మభూమి వంటి కార్యక్రమాలకు కళాకారులు ప్రదర్శించారని చెప్పారు. ఇప్పటివరకు బకాయి సొమ్ము అందించకపోవడంతో అనేకమంది కళాకారులు అప్పులు పాలై మృతిచెందిన సంఘటనలు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కళాకారులకు బకాయి సొమ్ము చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ పథకం రద్దుపై సిపిఎం నిరసన పిలుపు

నేడు జిల్లా వ్యాప్తంగా ఆందోళన

విశాలాంధ్ర-పాడేరు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలకు నిరసనగా ఈనెల 19న నేడు అన్ని మండలలో గాంధీ విగ్రహాలవద్ద సత్యాగ్రహ, మౌనదీక్షలతో నిరసన తెలియజేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని సిపిఎం పార్టీ అల్లూరి జిల్లా కమిటీ కార్యదర్శి పి. అప్పల నరస ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీకి చట్టబద్ధ హక్కుగా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను సి పి ఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (విబి-జి ఆర్ఎమ్ జి) పేరుతో ఉపాధిహామీ పథకానికి "రాంరాం" పలకనున్నారని. పని హక్కుగా ఉన్న పాత చట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా అమలు చేయనున్నారని. ఇప్పటి వరకు వ్యవసాయ కార్మికులకు డిమాండ్‌ను బట్టి ఉపాధి కల్పించే విధానాన్ని మార్చివేసి అవసరాన్ని (సప్లయిని) బట్టి పనులు పెట్టడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమేనని అన్నారు. గ్రామీణ కూలీలకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని పక్కదారి పట్టించేందుకు ఈ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించారని అన్నారు. పనిదినాలు 100 నుండి 125 రోజులకు పెంచనున్నట్లు చెప్పడం ప్రజలను మభ్యపెట్టేందుకేనని, ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం కొత్త బిల్లు వల్ల నామమాత్రంగా మారుతుందని అన్నారు. మరోవైపు 10 నుండి 40 శాతానికి రాష్ట్రాలపై భారం పెంచారని, ఇప్పటికే యంత్రాలు కేటాయించి కూలీల డిమాండ్ తగ్గించారని గుర్తు చేశారు. వ్యవసాయ పనుల పేరుతో 60 రోజుల ఉపాధిని సస్పెండ్ చేసి ఈపథకాన్ని రైతులకు పోటీగా మారుస్తోందని , ఈ పథకం అమలుకు ఇప్పటి వరకు కేంద్రం ఇస్తున్న 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై వేల కోట్ల అదనపు భారం వేస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంపై ఏటా సుమారు నాలుగు వేల కోట్లు అదనపు భారం పడనుందని, ఇప్పటికే లక్షల కోట్లు అప్పుల్లో వున్న రాష్ట్రం ఈ అదనపు భారాన్ని ఎలా భరించగలదని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వానికి కీలక మద్దతుగా వున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించుకునేటట్లు కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. మన రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపీలు పార్లమెంటులో దీన్ని వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 19వ తేదీనా గాంధీజీ విగ్రహాల వద్ద సిపిఎం చేస్తున్న నిరసనల్లో పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశానికి సి పి ఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎల్. సుందర్ రావు, వి. దాస్ పాల్గొన్నారు.

సమగిరిని నూతన పంచాయతీ కేంద్రంగా పరిశీలించాలి

విశాలాంధ్ర-చింతపల్లి : రాష్ట్ర ప్రభుత్వం నూతన పంచాయతీ ల ప్రతిపాదన నేపథ్యంలో గొంది పాకల పంచాయతీలో సమగిరి గ్రామాన్ని నూతన పంచాయతీ కేంద్రంగా చేయాలన్న సమగిరి గ్రామస్తుల నిర్ణయాన్ని పరిశీలించాలని గొంది పాకల సర్పంచ్ సాగిన వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు తాంబేలి మోహన్ రావు, చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రొబ్బా హశ్వంత్ లు అన్నారు. గురువారం ఆ పంచాయతీ పీసా కమిటీ నాయకులు, సమగిరి గ్రామస్తులతో కలిసి చేసుకున్న తీర్మాన పత్రాన్ని ఎంపీడీవో సీతామహాలక్ష్మికి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీల విభజన చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన నేపథ్యంలో తమ గొందిపాకల పంచాయతీలో దూరంగా ఉన్న గ్రామాలను ఏకం చేస్తూ సమగిరి ని పంచాయతీ కేంద్రంగా చేసేందుకు పరిశీలించాలని గ్రామస్తులమంతా తీర్మానించుకున్నట్లు ఈ సందర్భంగా వారు ఆమె దృష్టికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో పీసా కమిటీ ఉపాధ్యక్షుడు పి లింగన్న రావు, వైసీపీ సీనియర్ నాయకుడు పి బెన్నా స్వామి, పంచాయతీ వార్డు సభ్యులు. లోవరాజు, రాజేశ్వరి, శివశంకర్, సోమరాజు, చిన్నారావు, సత్తిబాబు, పావని, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జిల్లా 'నిర్మాణ్' పథకం భేష్

కలెక్టర్ దినేష్ కుమార్‌ను అభినందించిన ముఖ్యమంత్రి

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : విద్యా రంగంలో వినూత్న మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో అమలు చేస్తున్న "సూపర్ 50 ఇన్స్పిరేషన్ ఇంజిన్ ఆఫ్ నిర్మాణ్" కార్యక్రమంపై ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. కలెక్టర్ల సదస్సులో భాగంగా అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ప్రజెంట్ చేశారు. 90 వేల మంది విద్యార్థులకు లబ్ధి, పదో తరగతి విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచడానికి 'మెంటారింగ్' పద్ధతిని కలెక్టర్ దినేష్ కుమార్ ప్రవేశపెట్టారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లోని ఆశ్రమ పాఠశాలల్లో "టీచింగ్ ఎట్ రైట్ లెవల్" అనే విధానంతో 'నిర్మాణ్' కార్యక్రమానికి రూపకల్పన చేశారు. తెలుగు, ఇంగ్లీష్, లెక్కలు వంటి సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచేలా శిక్షణ నివ్వడంతో ఇప్పటివరకు సుమారు 90 వేల మంది విద్యార్థులు ప్రయోజనం పొందారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. విద్యాశాఖ ప్రారంభించే ఇలాంటి వినూత్న కార్యక్రమాలను జిల్లా కలెక్టర్లే స్వయంగా పర్యవేక్షించి ముందుకు తీసుకెళ్లాలి. టెక్నాలజీని ఉపయోగించుకుంటూ సరికొత్త ఆలోచనలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కుప్పంలో ప్రారంభించిన 'విలువల బడి' తరహాలోనే, చదువుతో పాటు విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలు మరియు క్రీడలను నేర్పించాలని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థులు కేవలం రాష్ట్రానికే కాదు, యావత్ ప్రపంచానికి భవిష్యత్ ఆస్తులని, వారిలో గొప్ప పరివర్తన తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. అల్లూరి జిల్లాలో విజయవంతమైన ఈ నిర్మాణ్ మోడల్‌ను మరింత మెరుగుపరిచి, ఇతర ప్రాంతాల్లో కూడా అమలు చేసేలా కలెక్టర్లు చొరవ చూపాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

వాటర్ క్యాన్స్ పంపిణీ

విశాలాంధ్ర-మోతుగూడెం : ఏ.పి.జెన్‌కో ఉద్యోగుల చేత ఏర్పాటు చేసిన కాలనీ వెల్ఫేర్ కమిటీ ఉద్యోగులకు మినరల్ వాటర్ ప్లాంట్ నుండి త్రాగు నీరు పంపిణీ కి ప్రతీ ఉద్యోగికి 2 వాటర్ కేన్స్ సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ %శ్రీ% మరియు కాలనీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అయిన కే రాజారావు పంపిణీ చేసారు. రాబోయే రోజుల్లో కూడా కాలనీ వెల్ఫేర్ కమిటీ ద్వారా మరిన్ని సౌకర్యాలు తమ ఉద్యోగులకు కార్మికులకు అందిస్తామని చీఫ్ ఇంజనీర్ కె.రాజారావు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఈ చిన కామేశ్వర రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాలకృష్ణ, వరప్రసాద్,అకౌంట్స్ ఆఫీసర్ ప్రసాద్ కాలనీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, ఉద్యోగుల పాల్గొన్నారు.

స్కిల్ సమగ్ర-2 పథకంపై పట్టు రైతులకు అవగాహన

- ఈ పథకం క్రింద 12మందికి రేజింగ్ పనిముట్లు పంపిణీ
- జిల్లాలో 400 మంది పట్టు పరిశ్రమ రైతులకు లబ్ది
- ఇంచార్జి జిల్లా జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : జిల్లా పట్టు పరిశ్రమ ప్రధాన కార్యాలయంలో స్కిల్ సమగ్ర-2 పథకంపై పట్టు రైతులకు అవగాహన సదస్సులో పాల్గొన్న ఇంచార్జి జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిని తిరుమణి శ్రీపూజ ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 1954 పాడేరు డివిజన్ లో చింతపల్లి, అరకు పాడేరులో మొదటి గా పట్టు పరిశ్రమను విరివిగా చేపట్టి రాష్ట్రంలోనే పట్టు ఉత్పత్తిని ఇతర రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలో అధిక పట్టుగుళ్లను సరఫరా చేసామన్నారు. 2014 సంవత్సరం నుండి ఇంతవరకు రైతులు ఇతర పంటల వైపు మొగ్గు చూపకుండా పట్టు పరిశ్రమ పంటలో నిమగ్నమై పట్టుగుళ్ల దారం ఉత్పత్తి చేస్తున్నారన్నారు. పట్టు పరిశ్రమ శాఖలో పదవి విరమణ ద్వారా ఉద్యోగుల సంఖ్య తగ్గడం వల్ల పట్టు పరిశ్రమ రైతులకు పట్టుపురుగుల ఉత్పత్తి తగ్గిందని గత మూడు సంవత్సరాల నుండి పట్టు రైతులకు అవగాహన కల్పిస్తూ పట్టు ఉత్పత్తిలో 400 మంది రైతులతో సుమారుగా 800 ఎకరాలలో పట్టుపురుగుల మలబార్ సాగు చేస్తున్నమన్నారు. సంవత్సరంలో పది పంటలు తీసుకొని ప్రతి నెల ఆదాయం వచ్చే విధంగా చూస్తున్నమన్నారు. ప్రస్తుత పట్టు రైతుల ద్వారా మిగిలిన రైతులకు అవగాహన కల్పించి పట్టు పరిశ్రమ ద్వారా ఆర్థికంగా లబ్ది పొందే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. మల్బరీ ఉత్పత్తి చేసే రైతులకు ఎస్సీ, ఎస్టీ, రైతులకు ఉత్పత్తిలో 90 శాతం రాయితీలు కల్పిస్తూ, ఇతర కులాల రైతులకు రైతులకు 75 శాతం ఇస్తున్నామన్నారు. స్కిల్ సమగ్ర-2 ద్వారా యాంత్రీకరణ పథకం క్రింద 5 యూనిట్లను, రోగ నిరోధక మందులను 156 యూనిట్లను, రేసింగ్ పరికరాలు 12 మందికి ఈరోజు పంపిణి చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమ అధికారి కె.అప్పారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బి ఎస్ నందు, రైతులు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అల్లూరి సీతారామరాజు
పేజి నెం. 2
శుక్రవారం 19, డిసెంబరు 2025

కన్నుల పండుగగా అటకేశ్వరస్వామి వారి వార్షికోత్సవం

విశాలాంధ్ర-మోతుగూడెం : మోతుగూడెం పంచాయతీ పరిధిలో గల పొల్లూరు పవర్ హౌస్ కొండపై అవతరించినటువంటి శ్రీశ్రీశ్రీ అటకేశ్వర స్వామి తృతీయ వార్షికోత్సవం ఆలయ కమిటీ వారు కన్నుల పండగ నిర్వహించారు. అర్చకులు కుమార్ స్వామి శర్మ ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామునుంచి స్వామి వారికి విఘ్నేశ్వర పూజ, పంచామృతాభిషేకములు, బిల్వార్చన, రుద్ర హోమము, మరియు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులు కొండపైన స్వామివారిని దర్శించుకోవడానికి వాహన సదుపాయం కల్పించారు. అనంతరం మధ్యాన్నం 12 గంటల నుండి అన్నసమారాధన నిర్వహించారు. ఈ యొక్క అన్నదాన కార్యక్రమంలో పొల్లూరు, మోతుగూడెం, మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఏలూరు జిల్లాలో ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన

పలు పాఠశాలలోను ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర-రంపచోడవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టి కమీషన్ చైర్మన్ చోళ్ల బొజ్జి రెడ్డి ఏలూరు జిల్లాలో పర్యటించారు. ముందుగా బుట్టాయగూడెం రెసిడెన్షియల్ స్కూల్, ఏకలవ్య విప్పలపాడు, దొరమామిడి ఆశ్రమ పాఠశాల, హాస్పిటల్, కామయకుంట ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. అలాగే రెడ్డిగూడెం గ్రామంలో ఆగి అక్కడి ప్రజల నుంచి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏకలవ్య విప్పలపాడు పాఠశాలలో మెనూ సక్రమంగా అమలుకాకపోవడం, హైజీన్ లోపాలు ఉండటం, లైబ్రేరియన్ పిల్లలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడన్న ఫిర్యాదులు రావడంతో, పై విషయాలపై పూర్తి స్థాయి ఎంక్వైరీ నిర్వహించాలని గురుకుల సెక్రటరీకి చైర్మన్ ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా, ఏకలవ్య విప్పలపాడు పాఠశాలలో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో క్రీడలు మరియు ఆర్ట్స్, సాంగ్స్ విభాగాల్లో ప్రతిభ చూపి పథకాలు సాధించిన విద్యార్థులను అభినందించి శాలువాతో సత్కరించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సుఖ ప్రసవాలు

విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం లోని మోతుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దిగ్విజయంగా సుఖ ప్రసవాలు వైద్యాధికారులు జరుపుతున్నారు. వివరాల్లోకి వెళితే ఎంసిడి క్యాంపుకు చెందిన కోర.సబిత (23) మొదటి కాన్పు కోసం మోతుగూడెం ప్రాథమింక ఆరోగ్య కేంద్రంకి రావడం జరిగినది. పీహెచ్‌సి మోతుగూడెంలో సుఖ ప్రసవం చేయడం జరిగినది. పండింటి ఆడ శిశువుకు ప్రసవం చేయడంజరిగింది. తల్లి బిడ్డ ఆరోగ్యం కేమంగా ఉంది. ఆ బాలింతను రెండు రోజులు పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పర్యవేక్షణలో ఉంచటం జరిగింది. ఐటిడిఏ పిఓ, చింతూరు పుల్లయ్య, పూర్తి సహకారంతో, సమరటర్ అఫ్ ది నేషన్ - యన్ఎఓ 2008 లేబర్ రూమ్ ఈక్విపిమెంట్ డొనేషన్ వల్ల ఇది సాధ్యం అయినది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాదికారి అభిజ్ఞ సహకారంతో సుఖప్రసవం సుఖప్రసవం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు విజయ వంతంగా "మొదటి కాన్పుతో మొదలు పెట్టడం జరిగింది. ఇక ముందు కూడా ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు అన్ని సౌకర్యాలతో చేయడం జరుగుతుందని డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ పుల్లయ్య, వైద్యాధికారులు తెలిపారు.

పునరావాస కాలనీలో మౌలిక సమస్యలు తీర్చాలి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని జీడిగుప్ప గ్రామంలో జీడిగుప్ప సచివాలయం సిబ్బంది సర్పంచ్ మూట్ల బాలరాజ్ అధ్యక్షతన, ఆర్ అండ్ ఆర్ కాలనీ బైరవ పట్నానికి సంబంధించిన పంచాయతీలోకి జీడిగుప్ప గ్రామస్తుల ఓట్లు బదిలీ కోసం గురువారం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశంలో ఆదివాసి కొండరెడ్ల సంఘం నాయకులు ముర్ల, కనకా రెడ్డి మాట్లాడుతూఎంచుకున్న ఆర్ అండ్ ఆర్ పునరావాస కాలనీలో బిల్డింగ్స్%డ% డ్రైనేజ్ బడి గుడి అనేక మౌలిక సమస్యలు ఉన్నాయి అందుకు ఓటర్ కార్డ్ ఆధార్ కార్డ్ రేషన్ కార్డ్ ఏ ఒక్క ఆధారాన్ని మార్చకూడదని పునరావాస కాలనీలో అన్ని సదుపాయాలు సమకూర్చినప్పుడే మా యొక్క ఓట్లను వేరే చోటకి బదిలీ చేయాలని పంచాయతీ ఎన్నికల సమయం వస్తే , జీడిగుప్ప పంచాయతీకి సంబంధించిన పంచాయితీ ఎన్నికలు జీడిగుప్ప పంచాయతీలోనే జరిపించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిసా కమిటీ సభ్యులు కదల కొండారెడ్డి పోడియం గోపాల్ వల్ల గణపతి రెడ్డి కోట్ల ఆనంద రెడ్డి కనుగుల హేమలత కె చ్చల హరినాథ్ రెడ్డి కనుగుల పెద్ద శ్రీనివాస్ రెడ్డి జీడిగుప్ప కార్యదర్శి వెంకటరమణ సచివాలయ సిబ్బంది జీడిగుప్ప గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మన్యం పెట్రోల్ బంకుల్లో వాహనదారులకు అందని ఉచిత సేవలు

పెట్రోల్ బంకులపై పట్టించుకోని సంబంధిత అధికారులు

విశాలాంధ్ర-పాడేరు : గిరిజన ప్రాంతంలో వివిధ సంస్థలతోపాటు వివిధ కంపెనీలకు చెందినా పెట్రోల్ బంకులు నిర్వహణలో అందుబాటులో ఉన్నప్పటికీ వాహనదారులకు కల్పించాల్సిన కనీస ఉచిత సేవలు మాత్రం అందని ద్రాక్షగానే ఉందని చెప్పక తప్పదం లేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి పెట్రోల్ బంకుల్లో కొన్నింటికి మాత్రమే అరకొర సౌకర్యాలు ఉన్నప్పటికీ మరికొన్ని బంకుల్లో మాత్రం ఆ సౌకర్యాలు ఎక్కడ కనిపించిన దాఖలాలు కనుమరుగైందని చెప్పవచ్చు .పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల శ్రేయస్సర్థం పలునియమ నిబంధనలు తప్పని సరిగా అందుబాటులోకి ఉండాలి అందులో వాహన దారుల వాహనాలకు టైర్లకు ఉచిత గాలి కొట్టాలి, స్వచ్ఛమైన తాగునీరుఅందుబాటులో ఉంచాలి, పరిశుభ్రమైన మహిళ పురుషులకు విడివిడిగా టాయిలెట్లు, ప్రథమ చికిత్స కిట్లు, అత్యవసర ఫోన్ కాల్ సదుపాయం, ఫిల్టర్ పేపర్స్, ఇంధన నాణ్యత, పరిమాణం తనిఖీ చేసుకునే అవకాశం వంటివి ఉచిత సేవలుగా తప్పనిసరిగా అందించాలి. వీటిలో కొన్నింటిని పెట్రోల్ కొట్టించకపోయినా పొందవచ్చు, ఇవి వినియోగదారుల సౌకర్యార్థం అందుబాటులో ఉంచే ప్రాథమిక సౌకర్యాలు ఈ సౌకర్యాలు లేకపోతే, సంబంధిత అధికారులకు లేదా చమురు కంపెనీలకు ఫిర్యాదు చేయవచ్చు అనే విషయాన్ని కూడా ఉన్నప్పటికీ ఇదేమీ కూడా అల్లూరి జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి బంకుల్లో ఉచిత సేవలు లేనే లేదు ఆ విషయం అధికారులకు తెలిసిన పట్టించుకున్న పాపాన లేదు. అంతేకాదు కనీసం తనిఖీలు చేపట్టకపోవడంకూడా అద మరిచిపోయారు అనడంలో సందేహమే లేదు దాంతో పెట్రోల్ బంకుల యజమానులు పెట్రేగి పోతూ ఇష్టానుసారంగా వారి వ్యాపారాల సౌలభ్యం కోసం ఉచిత సేవల్ని వినియోగదారులకు అందుబాటులో లేలేదు. దాంతో వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ సిగ్గు విడిచి బయటికి వెళ్ళే పరిస్థితి... ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ న్నారంటే బంకు యజమానులతో కుమ్మక్కపోయారనే ఆరోపణలు కూడా లేకపోలేదు.ఏది ఎంతవరకు అనేది అధికార్ల మనస్సాక్షి కె వదిలేయాలి. కావున నిజాని నిగ్గు తేల్చాల్సింది అధికార్లే కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పెట్రోలు బంకులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాహనదారులకు అందాల్సిన ఉచిత సేవలు సక్రమంగా అందే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అదే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన బంకు యజమానులకు కేసులు నమోదు చేసి కఠినంగా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఉచిత సేవలు అందే విధంగా చర్యలు తీసుకొంటారో లేదో వేచి చూద్దాం మరి.

అంబుజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియామక పత్రాలు

విశాలాంధ్ర-మారేడుమిల్లి : అంబుజా నైపుణ్యం ఫౌండేషన్, రంపచోడవరం వారి ఆధ్వర్యంలో మారేడుమిల్లి మండలం దేవరపల్లి గ్రామంలో స్కిల్ డెవలప్మెంట్ కోర్సుల్లో శిక్షణ పొందిన విద్యార్థులు ఉద్యోగాలు సాధించిన సందర్భంగా వారి తల్లిదండ్రులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అంబుజా ఫౌండేషన్ తరపున విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించి సత్కరించారు. తమ పిల్లలకు మంచి భవిష్యత్తు అందించేందుకు దోహదపడిన అంబుజా నైపుణ్యం ఫౌండేషన్ యాజమాన్యానికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి గ్రామ సర్పంచ్ చిన్న లచ్చిరెడ్డి, ఎంపిటీసీ విద్యాలక్ష్మి, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సైబర్ క్రైమ్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర-అరకులోయ: ప్రస్తుత సాంకేతిక యుగములో సైబర్ క్రైమ్ నేరాలు పెరిగిపోయాయని వీటిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ సిఐ వెంకటరమణ, అరకులోయ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.హిమగిరి అన్నారు.గురువారం మండలంలోని ఎండపల్లివలస సెయింట్ జోసెఫ్ పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సాంకేతిక ప్రపంచంలో ఎప్పటికప్పుడు సైబర్ క్రైమ్ మోసాలు పెరిగిపోతూ వస్తున్నాయని దీనిపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ప్రధానంగా సెల్ ఫోన్లు వినియోగించేవారు మోసపూరిత యాప్లపై అప్రమత్తంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు.సైబర్ క్రైమ్ నేరస్తులు తమ మోసాన్ని బట్ట బయలు చేయకుండా ప్రజలను ఊబిలోకి దించడానికి అనేక రకాలుగా ప్రయత్నిస్తు టెక్స్ట్,వాట్సాప్ లకు అనేక మెసేజ్లు పంపిస్తూ ఉంటారని వీటిపై మాత్రం చాలా అప్రమత్తంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు ఏఐతో నయమోస మీటింగ్ నమ్మి మోసపోవద్దని అప్రమత్తంగా ఉండాలని వారు తెలిపారు. అలాగే ఆన్లైన్ ట్రేడింగ్,నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు గురించి టెలిగ్రామ్ వాట్సాప్ లో టాస్క్ పేరుతో టాస్క్ పేరుతో జరిగే ఇన్వెస్ట్మెంట్ మోసాలతో జాగ్రత్త గా ఉండాలని,ఇన్స్టాగ్రామ్ లో పాల్ అవుతూ యూట్యూబ్లో లైకులు కొడితే డబ్బులు ఇస్తామంటూ సైబర్ నేరగాళ్లు ఆశ చూపించి మోసాలు చేస్తారని ఎవరు నమ్మి మోసపోవద్దని వారన్నారు. సైబర్ మోసాలకు మోసపోయిన వెంటనే సైబర్ ఫిర్యాదుల కోసం 1930 నెంబర్ కు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు.ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు కలగవన్నారు. కళాశాలలో, పాఠశాలల్లో పోలీస్ శాఖ ఎందుకు అవగాహన,చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తుందంటే విద్యార్థులు సెలవులలో తమ గ్రామాలకు వెళ్ళినప్పుడు తల్లిదండ్రులను, గ్రామస్తులను చైతన్య పరుస్తారని అందుకే పోలీస్ శాఖ ఈ కార్యక్రమాలు చేపడుతుందన్నారు.ముఖ్యంగా యువత గంజాయి, మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు.గంజాయి, మాదకద్రవ్యాల రవాణా వలన యువత భవిష్యత్తు అంధకారమయం అవుతుందని వారు విచారం వ్యక్తం చేశారు. యువతి యువకులు నేడు మంచి భవిష్యత్తు కోసం తపన పడాలి తప్ప ఇతర వ్యసనాలకు బానిస కాకూడదని వారు పిలుపునిచ్చారు.తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో పిల్లల భవిష్యత్తుపై సంకల్పంతో చదివిస్తున్నారని వారి నమ్మకం, సంకల్పం నిలబెట్టడం కోసమే యువతి యువకులు ముందుకు సాగాలని వారు విజ్ఞప్తి చేశారు. మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని భవిష్యత్తుని నాశనం చేసుకుంటే తల్లిదండ్రులు అనేక ఆవేదన గురై కన్నీటి పర్యంతం అవుతారని వారిని సంతోషంగా నిలపడం కోసం గంజాయి, మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్ వంటి నేరాలకు దూరంగా ఉండాలని వారు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు,పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజి నెం. 10
పార్వతీపురం మన్యం
శుక్రవారం 19, డిసెంబరు 2025

రీసర్వేతో భూ సమస్యలకు చెక్ : తహసిల్దార్

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియ ద్వారా ఎక్కడా కూడా భూ సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారం లభిస్తాయని ఇది రైతాంగానికి ఎంతో దోహదపడుతుందని తాసిల్దార్ ఎం. సురేష్ అన్నారు. ప్రస్తుతం మండలంలోని జమదాల పంచాయతీ పరిధిలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను గురువారం అయినా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో రీసర్వే గ్రామసభ నిర్వహించి, సర్వే ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలకు రైతులకు వివరించారు. పూర్వీకుల భూములు అయినప్పటికీ అందుకు సంబంధించి హక్కుదారుల యొక్క పత్రాలు పూర్తిస్థాయిలో చూపిస్తే అటువంటి వారికి రిసర్వేలో ఎంతో న్యాయం జరుగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు కూడా ఉపయోగించుకోవాలని వారి వారికి సంబంధించి పంట పొలాలు వాటి హద్దులు గుర్తించి క్షేత్రస్థాయిలోనే సమస్య పరిష్కారం అవుతుందని సర్వేకు వచ్చిన సిబ్బందికు రైతులు సహకరించాలని సూచించారు. శాశ్వత హక్కు పొందేందుకు ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ భూ సర్వే ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎటువంటి చిన్న చిన్న లోటుపాట్లు ఉన్న రైతులు వాటిని పరిష్కరించుకోవచ్చని పూర్వీకుల ఆస్తులు అయినప్పటికీ ప్రభుత్వం నుంచి పూర్తి పత్రాలు పొందవచ్చని అన్నారు.

జి.శివడ పంచాయతీలో కృషి విజ్ఞాన కేంద్ర సేవలపై అవగాహన

విశాలాంధ్ర-కురుపాం : మండలం లోని జి.శివడ పంచాయతీ చిన అంటిజోల ,రాముడు గూడ లలో కృషీవిజ్ఞాన కేంద్రం అవగాహన కార్యక్రమాలు గురువారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ప్రథమ శ్రేణి ప్రదర్శన భాగంగా సన్నజీవాల బరువు పెరుగుదల కోసం రైతులకు ఖనిజ లవణ మిశ్రమ ఇటుకలు కె వి కే శాస్త్రవేత్తలు డాక్టర్ అను జి మరియు వై ఉమా జ్యోతి చేతుల మీద గా పంపిణీ చేశారు. అలాగే కృషీవిజ్ఞాన కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు వివరించి సద్వినియోగం చేసుకోవాలని రైతులకు కోరారు.క్షేత్రస్థాయి పరిశీలన భాగంగా మహిళలకు అరటికాయ పిండితో చిన్నపిల్లలకు ఫీడింగ్ ఫుడ్ తయారు చేయడం నేర్పించారు. మండలం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శైలజ, అనిమల్ హస్బండ్రీ అసిస్టెంట్ గంగారావు, పార్వతి గ్రామ సర్పంచు మిన్నారావు, నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

జనసేన పార్టీకి పెంట తిరుపతిరాజు గుడ్‌బై

విశాలాంధ్ర-మక్కువ : మండలంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు ఆ పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు పార్టీలో చేరినప్పటి నుండి ఇప్పటివరకు పార్టీకి సంబంధించిన వ్యవహారాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, సరైన దిశ నిర్దేశాలు లేవని, వాటి గురించి ఏ ఒక్కరు పట్టించుకోకపోవడంతో విసుగు చెందే ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఆయన వెల్లడించారు. మండలంలోనే కాకుండా పార్వతీపురం, సాలూరు నియోజకవర్గం స్థాయిలో కాస్త పేరు ఉన్న నేతగా పెంట తిరుపతిరావుకు గుర్తింపు ఉంది. తెలుగుదేశం పార్టీలో దీర్ఘకాలం పనిచేసిన ఆయన గత ఎన్నికల్లో ఎం.తేజోవతికి సాలూరు నియోజకవర్గం టికెట్ కోసం గట్టిగా ప్రయత్నించిన వ్యక్తులులో ఈయన ఒకరు. ప్రస్తుతం మంత్రి సంధ్యారాణితో నెలకొన్న విభేదాలు కారణంతో అప్పట్లో టిడిపిని వీడి జనసేనలో చేరారు. ప్రస్తుతం టిడిపి అరకు పార్లమెంట్ అధ్యక్షురాలుగా ఎం.తేజవతికి టిడిపి అధిష్టానం పగ్గాలు ఇవ్వడం, ఈ తరుణంలో పి.తిరుపతిరావు జనసేన పార్టీకి రాజీనామా చేయడంతో మండలంలో ఈ అంశం చర్చకు దారితీసింది. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతుండడంతో రాజకీయంగా పి.తిరుపతిరావు ఏ విధమైన నిర్ణయం తీసుకుంటారోనని ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.

తిత్తిరి పంచాయతీ నుంచి టిడిపిలోకి 100 కుటుంబాలు చేరిక

విశాలాంధ్ర-కురుపాం : మండలంలోని తిత్తిరి పంచాయతీ పరిధిలోని గుమ్మిడిగూడ, పులిపుట్టి, చిన తులసి, గుండం, దిగువ గుండం గ్రామాలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సుమారు 100 కుటుంబాలు పార్టీని వీడి గురువారం రాష్ట్ర విప్ తోయక జగదీశ్వరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర విప్ లితోయక జగదీశ్వరి వారికి తెలుగు దేశం పార్టి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పనితీరు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే చొరవతో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై సుమారు 100 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్లు వారు తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో టీడీపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు నచ్చి ఈ నిర్ణయం తీసుకున్నామని పార్టీ మారిన కార్యకర్తలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కె.వి.కొండయ్య, మాజీ ఎంపీటీసీ బిడ్డిక కడాయి, బ్రహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయకో, మాజీ ఎంపీపీరమణమూర్తి, సుకేష్ చంద్ర, సుబ్బలక్ష్మి, తిరుపతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో పర్యాటక అభివృద్ధికి చర్యలు

ఐటిడిఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్

విశాలాంధ్ర-సీతంపేట : మన్యం ప్రాంతంలో ఉన్న పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయుటకు చర్యలు తీసుకుంటామని ఐటిడిఏ పీవో పవార్ స్వప్నిల్ అన్నారు. గురువారం ఆయన జగతిపల్లి వ్యూ పాయింట్, సున్నపద్ద జలపాతం, చంద్రమ్మ తల్లి ఆలయం, పొల్ల వ్యూ పాయింట్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎక్కువమంది పర్యాటకులను ఆకర్షించే విధంగా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జగతిపల్లి వ్యూ పనులను పునఃప్రారంభించుటకు చర్యలు చేపడతామని అన్నారు. సున్నపుగడ్డ జలపాతం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అన్నారు. పర్యాటకులు కూర్చునే విధంగా వెదురుతో బెంచీలు ఏర్పాటు చేస్తామని అన్నారు. పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.లి జగతిపల్లి జీపిఎస్ పాఠశాలను మరియు అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన ఉండాలని సూచించారు. అంగన్వాడీలో విద్యార్థులకు పోషకాహార భోజనం అందించాలని ఆదేశించారు.అనంతరం పెద్దపొల్ల బాలుర ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో ముస్తాబు కార్యక్రమం పక్కాగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదే విధంగా విద్యా ప్రగతి కార్యక్రమాన్ని కూడా అమలుపరచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు.గడిగుజ్జి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిపిపి విధానానికి వ్యతిరేకంగా ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద సీపీఐ నిరసన

విశాలాంధ్ర-బెలగాం : పిపిపి విధానానికి వ్యతిరేకంగా సిపిఐ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం పార్వతీపురం మన్యం జిల్లా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు అప్పటి ప్రతిపక్ష హెూదాలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు ఇప్పుడు అధికారంలో ఉన్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తన యువగళం పాదయాత్రలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చారని అందులో ముఖ్యమైన హామీ మెడికల్ కళాశాలలను ప్రయివేటు పరం చేయమని రాష్ట్రంలో సుమారుగా 18 మెడికల్ కళాశాలలు ఉన్నాయని వాటిని ప్రభుత్వరంగ సంస్థలుగానే నడుపుతామని హామీ ఇచ్చారని కానీ నేడు విద్యాశాఖ మంత్రి ఆహామీని ప్రక్కన పెట్టి పిపిపి (పబ్లిక్ ప్రైవేటు పార్ట్ నర్ షిప్) విధానం అని చెప్పి ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేటుకు అప్పగించే ఉద్దేశంతో జీవో 590ని చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చిందని ప్రైవేటు వారికి అప్పచెప్పే ప్రయత్నం అత్యంత దుర్మార్గమైన చర్యని విమర్శించారు. ఈరోజు అదే జరిగితే భవిష్యత్తులో పేదవారికి వైద్య విద్య అందే ప్రసక్తి లేదని ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం కూడా అందని పరిస్థితికి ఈ విధానాలు దారితీస్తున్నట్లు ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ రంగంలో స్థిరమైన ఉద్యోగావకాశాలు యువతకి అందకుండా పోతాయని, ప్రజారోగ్య హక్కులు, ప్రభుత్వ వైద్య విద్యా వ్యవస్థలు విచ్ఛిన్నమవుతాయని వారు హెచ్చరించారు. కాబట్టి విద్యాశాఖ మంత్రి లోకేష్ మరొక్కమారు దీనిపై పునరాలోచన చేసి ప్రభుత్వపరంగా నడిపేవిధంగా చేయాలని లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు శ్రీకారం చూడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు కూరంగి గోపి నాయుడు, బిటి నాయుడు, ఎఐఎస్ఎఫ్ నాయకులు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని స్థాపిద్దాం

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసి, పోలియో రహిత సమాజాన్ని స్థాపించేందుకు ప్రతి ఒక్కరు దోహదపడాలని పీహెచ్సీ వైద్యులు శంకర్రావు పిలుపునిచ్చారు. ఈనెల 21వ తేదీన జరగనున్న జాతీయ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పీహెచ్సీ పరిధిలో గల బంధ లుప్పి గ్రామంలో ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్ వైద్యుల శంకర్రావు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని అలాగే చుక్కల మందు పంపిణీ కార్యక్రమం తర్వాత వైద్య సిబ్బంది తప్పనిసరిగా డోర్ టు డోర్ సర్వే చేసి మిగిలిన ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లాలి అన్నారు. మూడు రోజులు పాటు జరిగే కార్యక్రమం పక్కాగా జరగాలని పీహెచ్సీ లక్ష్యాన్ని చేదించి ప్రతి ఒక్క చిన్నారికి చుక్కల మందు వేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో జరిగిన ర్యాలీలో వైద్య సిబ్బందితోపాటు ఏఎన్ఎంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల ఆకస్మిక సందర్శన

చిన్నారుల ఎత్తు, బరువు తప్పనిసరి: పిడి కనకదుర్గ

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎత్తు బరువులను ఎప్పటికప్పుడు లెక్కించుకొని వారికి సక్రమంగా పౌష్టికాహారం అందించాలని అలాగే గర్భిణీలు బాలింతల కోసం ప్రభుత్వం ఇస్తున్న బాలామృతం బాల సంజీవిని హెూమ్ రేషన్ ఆయా లబ్ధిదారులకు సక్రమంగా అందాలని మన్యం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కనకదుర్గ అన్నారు. మండలంలోని కృష్ణపల్లి ఎల్ ఎన్ పురం గ్రామాల్లో గల అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా గురువారం సందర్శించారు. ప్రాజెక్ట్ సిడిపిఓ జే రేఖవాణితో కలిసి అంగన్వాడీ కేంద్రాల యొక్క నిర్వహణ, చిన్నారుల యొక్క స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఉన్న స్టాక్ నిల్వ యొక్క రిజిస్టర్ లను పరిశీలించి, వాటి యొక్క ఉపయోగ తేదీలను క్షుణ్ణంగా చూశారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారాన్ని నేరుగా పిడి కనకదుర్గ ఆమె చేతులతో వంట చేసి, రుచి చూసి చిన్నారులకు పంపిణీ చేశారు. కేంద్రాలు పరిశుభ్రంగా పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణంలో ఉండాలని, పిల్లల మానసిక ఎదుగుదల కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఆట వస్తువులను సక్రమంగా ఉపయోగించుకోవాలని, ప్రతి చిన్నారి మానసిక ఉల్లాసంగా ఆనందంగా కేంద్రాలకు రావాలని సూచించారు. గర్భిణీల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని, హెూమ్ రేషన్ను సక్రమంగా వారు ఉపయోగించుకొని రక్తహీనత లేకుండా శిశువుకు జన్మించాలని ఇందుకోసం కార్యకర్తలు గర్భిణీలో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అంగన్వాడీ చిన్నారులు ప్రీస్కూల్ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎక్కడ మానసిక ఒత్తిడికి లోనై పిల్లలపై చర్యలు తీసుకోవడం మంచిది కాదని హెచ్చరించారు. కేంద్రాల నిర్వహణ చిన్నారుల ఆటపాటలు చూసి పిడి కనకదుర్గ ఆనందం వ్యక్తం చేశారు. సక్రమంగా విధులు నిర్వహించి ప్రాజెక్టుకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా కార్యకర్తలకు సూచించారు. పిడి పర్యటనలో ఆమెతో పాటు ప్రాజెక్ట్ పిఓ. జే. రేఖవాణి సూపర్వైజర్లు కార్యకర్తలు ఉన్నారు.

ఈనెల 23, 24 తేదీల్లో అన్వేష సైన్స్ ఫెస్ట్

విశాలాంధ్ర - సీతంపేట : ఐటిడిఏ పరిధిలో గల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 2025 గిరిజన విద్యార్థుల విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తి సృజనాత్మ పై 7 దీమ్స్ 1. గ్రామ సమస్యలు నా ఆవిష్కరణలు 2. స్థిరమైన భవిష్యత్తు కోసం ప్రకృతి మరియు టెక్నాలజీ 3. ఆరోగ్యం గ్రామీణ వైద్య ఆవిష్కరణ4. భవిష్యత్తు పాఠశాలలు 5. చిన్న రైతుల కోసం వ్యవసాయ సాంకేతికత6. స్మార్ట్ హిల్ ట్రాన్సస్ పోర్ట్ 7. వ్యర్థాల నుండి సంపద అనే ఏడు ఏక్టివిటీస్ పై సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించడం జరుగుతుందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పవర్ సిగ్నల్ జగన్నాథ్ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ నిర్వహణకు ఉపాధ్యాయులతో తొమ్మిది కమిటీలు వేయడం జరిగిందని, 6,7,8 తరగతులు విద్యార్థులు జూనియర్స్ విభాగం, 9,10 తరగతులు విద్యార్థులు సీనియర్స్ విభాగం కింద సైన్స్ విజ్ఞానంపై పలు ఏక్టివిటీస్ చేయడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను 22వ తేదీ సాయంత్రం ఎగ్జిబిషన్ జరుగు పాఠశాల వద్దకు తీసుకువచ్చి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

ఘనంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-వీరఘట్టం/పాలకొండ : పౌర విమానయాన శాఖ కేంద్ర మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలు పాలకొండ పట్టణంలో గురువారం ఆ పార్టీ పట్టణ నాయకులు మండల నాయకులు ఘనంగా నిర్వహించారు ముందుగా నక్కల పేటలో షిరిడి సాయి మందిరం ఆవరణలో పట్టణ టిడిపి అధ్యక్షుడు గంట సంతోష్ కుమార్ రామ్ సేన అధ్యక్షుడు సారిపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కేకును కోసి శుభాకాంక్షలు తెలిపారు, అనంతరము శ్రీ కోటదుర్గ ఆలయంలో కింజరాపు రామ్మోహన్ నాయుడు పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు టిడిపి ఇన్చార్జి పడాల భూదేవి ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డులో టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొనగా కేకును కోసి జన్మదిన శుభాకాంక్షలు సందడిగా చేశారు అనంతరము స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంచిపెట్టారు అలాగే స్థానిక సీల్ నాయుడు విద్య సంస్థలలో రామ్మోహన్‌నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి సింహాద్రి %ఎష్ట% శివానంద ముంజేటి త్రినాధరావు భోగాది వెంకటరమణ గుడ్ల శంకర్రావు దుప్పాడ రమణ వారాడ సుమంత్ నాయుడు కౌన్సిలర్ పడాల రాంబాబు జవరాజు శిల్ల గుప్త పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డోలీ మోతల నిర్మూలనకు కూటమి కృషి చేస్తోంది : రాష్ట్ర విప్ తోయక జగదీశ్వరి

విశాలాంధ్ర కురుపాం : గిరిశిఖర గ్రామాలకు శాశ్విత రహదారులు నిర్మాణం ద్వారా డోలీమోతలు లేకుండా చేయటమే కూటమి ప్రభుత్వం ఏకైక లక్ష్యం అని రాష్ట్ర విప్ తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని టొంపలపాడు-తులసి బిటి రహదారి నిర్మాణానికి రాష్ట్ర విప్ తోయక జగదీశ్వరి గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా విప్ జగదీశ్వరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టొంపలపాడు-తులసి బి.టి.రహదారి నిర్మాణం కోసం.4కోట్ల.46 లక్షల రూపాయలు మంజూరు చేయటం జరిగిందని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో గ్రామాల్లో అభివృద్ధి ,మౌలిక వసతులు కల్పనకు కూటమి ప్రభుత్వం విశేషంగా పని చేస్తుందని అన్నారు.గిరిశిఖర గ్రామాలకు రహదారి సదుపాయాల అభివృద్ధితో రవాణా వ్యవస్థ మెరుగుపడి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు పొందేవిధంగా నేరుగా లాభం చేకూరుతుందని అన్నారు. గిరిశిఖర గ్రామాలకు పక్కా రహదారుల రూపకల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, డోలి మోతలకు పూర్తిగా స్వస్తి పలకడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గారు అన్నారు. గ్రామాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కద్రక కళావతి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కద్రక మల్లేశ్వరరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి బిడ్డిక పద్మావతి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయకో, మండల కన్వీనర్ కె.వి. కొండయ్య, బీజేపీ మండల కన్వీనర్లు కద్రక అప్పలస్వామి, వూయక ఆనంద్, పీఏసీఎస్ చైర్మన్ దొల్లు కిషోర్, నాయకులు కడాయి, రమణమూర్తి, సుకేష్ చంద్ర, సుబ్బలక్ష్మి, మంజువాణి, తిరుపతిరావు, శంకర్రావు, ప్రదీప్ శ్రీను, రామకృష్ణ, నాగేశ్వరావు, సురేష్, స్థానిక సర్పంచ్ థాత్రాజ్, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ విద్యార్థులకు క్రీడాకారుల దుస్తులు అందజేత

విశాలాంధ్ర-సీతానగరం:ఈ నెలలో చిత్తూరు జిల్లాలో జరగనున్న స్పోర్ట్స్ అథ్లెటిక్ క్రీడలకు హాజరుకానున్న జోగమ్మపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంకు చెందిన 40మంది విద్యార్థులకు క్రీడాదుస్తులను జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మమ్ముల విశ్వేశ్వరరావు, సీతానగరంకు చెందిన సామాజిక కార్యకర్త పిల్లి సతీష్ (సీనియర్ జర్నలిస్టు)లు సంయుక్తంగా అందజేశారు. పిల్లలకు క్రీడాదుస్తులు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజారావు, వైస్ ప్రిన్సిపల్ ఈశ్వరరావు ఫిజికల్ టీచర్ పుల్లారావుతోపాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడలకు హాజరుకానున్న విద్యార్థులకు క్రీడాదుస్తులు ఇవ్వడంపట్ల మమ్ములను, పిల్లి సతీష్‌లను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

అన్ని పత్రాలు ఉన్నా... అమ్మకానికి చిక్కులు

రిజిస్ట్రార్ వేధిస్తున్నారంటూ ఆస్తి హక్కుదారులు ఆరోపణ

విశాలాంధ్ర-సాలూరు : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల వ్యవహార శైలితో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. స్థిరాస్తి క్రయవిక్రయాలకు వివిధ కారణాలు చూపుతూ అడ్డుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు.సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు తీరుతో అవసరానికి ఆస్తులను అమ్ముకునే అవకాశం లేకుండా పోతుందని పట్టణానికి చెందిన అడ్వకేట్ పేర్ల విశ్వేశ్వరరావు, గంట తాతాజీలు ఆరోపించారు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తమకు ఎదురైన అనుభవాన్ని తెలిపారు.ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం విశ్వేశ్వరరావు 2021వ సంవత్సరంలో డాక్యుమెంట్ నంబర్ 3760 ప్రకారం డీలక్స్ సెంటర్ వద్ద ఉన్న స్థిరాస్తిని కొనుగోలు చేశారు.సదరు ఆస్థిని అమ్మకానికి పెట్టగా కొంతమంది కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారు.వారిలో కొందరు రిజిస్ట్రార్ ఆఫీసర్‌ని కలిసి అడుగగా ఆ ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయబోమని తేల్చి చెప్పారని,దీనితో కొనుగోలుకు ముందుకు వచ్చిన వారు వెనకడుగు వేస్తున్నారని తెలిపారు.అలాగే గంట తాతాజీ అనే వ్యాపారి 2019 లో డాక్యుమెంట్ నంబర్ 3021 ప్రకారం డీలక్స్ సెంటర్ వద్ద రేకుల షెడ్డుతో కూడిన ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేశారు.దీనిని అమ్మేందుకు సిద్ధపడగా రిజిస్ట్రేషన్ చేయడం కుదరదని రిజిస్ట్రార్ అడ్డు పెడుతున్నారన్నారు.ప్రైవేటు ఆస్తి క్రయవిక్రయాలు రిజిస్ట్రార్ అడ్డుతగలడం అన్యాయమని వాపోయారు. మా ఆస్తిని మేము అమ్ముకునేందుకు అవకాశం లేకపోవడం బాధాకరమన్నారు. నాలుగైదేళ్ళ క్రితం కొనుగోలు చేసినప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడెందుకని ప్రశ్నించారు. రిజిస్ట్రార్ తీరువలన ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఆయన తీరువలన ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందన్నారు. రిజిస్ట్రేషన్ చేయకుండా వేధింపులకు గురిచేస్తున్న సబ్‌రిజిస్ట్రార్ నాగరాజుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని సబ్‌రిజిస్ట్రార్ నాగరాజు వద్ద విలేఖరుల బృందం ప్రస్తావించంగా అది పూర్తిగా ప్రైవేటు వ్యక్తులకు సంబందించిన ఆస్తి అయినప్పటికీ రిజిస్టర్ చేసేందుకు దేవాదాయ శాఖ అభ్యంతరాలు వ్యక్తం చేసిందన్నారు. అసిస్మెంట్ 1092013506, 1092002926, 1092002374, 1092002375 అను నంబర్లు గల ఆస్తులు క్రయ విక్రయాలు జరపవద్దని దేవాదాయ శాఖ వారినుండి లేఖ వచ్చిందన్నారు. దేవాదాయ శాఖ వారి ఆదేశాలతో పైన పేర్కొన్న నంబర్ల ఆస్థిని రిజిస్టర్ చేయలేమన్నారు. 2019,21 సంవత్సరాలలో రిజిస్ట్రేషన్ ఎలా చేశారని ప్రశ్నించగా ఆ కాలంలో ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదన్నారు. ప్రస్తుతం దేవాదాయ శాఖ వారు రిజిస్టర్ చేయవద్దని లిఖిత పూర్వకంగా సూచించారని పేర్కొన్నారు.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి: యుటిఎఫ్

విశాలాంధ్ర-సీతానగరం: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాయాలని నిర్దేశించడం సరికాదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళి మోహనరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయంవద్ద గురువారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2010 సంవత్సరానికి ముందర ఉపాధ్యాయులుగా చేరిన వాళ్ళు డీఎస్సీ ద్వారా నియామకమయ్యారని, ఆనాటికి టెట్ అనేది లేదని కానీ 2009లో వచ్చిన విద్యాహక్కు చట్టం నేపథ్యంలో ఉపాధ్యాయులకు ఉన్న వారందరూ రెండేళ్లలో టెట్ పరీక్ష పాస్ కావాలని, లేనిచో వారు విధుల నుండి స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకోవాల్సి ఉంటుందని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, దీనివలన ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. దీనివల్ల విద్యార్థులకు బోధనలో నష్టం చేకూరుస్తుందని ఆయన తెలియజేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటీషన్ వేయాలని కేంద్ర ప్రభుత్వం చేత కూడా రివ్యూ పిటీషన్ వేయించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి పూర్తి మినహాయింపు వచ్చేందుకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె భాస్కరరావు మాట్లాడుతూ పార్లమెంటులో విద్యాహక్కు చట్టానికి తగిన సవరణ చేయడం ద్వారా సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుండి శాశ్వతంగా పరిష్కారం దొరుకుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆదివారాలు మరియు సంక్రాంతి సెలవుల్లో కూడా ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరుకావాలని ఆదేశాలు వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలలుగా ఉన్నచోట ఉపాధ్యాయులకు సెలవులు వినియోగించుకునే అవకాశం లేకుండా పోతుందని, దానికి తగిన పరిష్కారం విద్యాశాఖ అధికారులు చూపాలని ఆయన కోరారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నైట్ వాచ్మెన్ గా పరిగణిస్తున్నారని, రాత్రి బసచేసి రాత్రి 9 గంటలకు 12 గంటలకు తెల్లవారుజామున 6 గంటలకు ఫోటోలు అప్లోడ్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఇది ఎంతవరకు సమంజసమని తెలిపారు. వినత పత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి హేమలతకు అందజేశారు. ఈకార్యక్రమంలో వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

విశాలాంధ్ర-సీతంపేట: మండల కేంద్రంలో గురువారం స్థానిక సంత మార్కెట్ వద్ద సబ్ ఇన్స్పెక్టర్ వై.అమ్మన్‌రావు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి డ్రైవింగ్ చేయాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదు ప్రమాదాలకు గురి కావద్దని తెలిపారు. మైనర్లుకు వాహనాలు ఇవ్వవద్దు ప్రమాదాలకు కారణం కావద్దన్నారు.

గిరిజన యువత ఆదర్శం

సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతులు

విశాలాంధ్ర-మారేడుమిల్లి : అల్లూరి సీతారామరాజు జిల్లా, మారేడుమిల్లి మండలం చావడికోట పంచాయతీ పరిధిలోని ఉప్పరిగోతులు గ్రామ యువత మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రభుత్వ అధికారులు, ఐటీడీఏ యంత్రాంగం మరియు రాజకీయ నాయకులు తమ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకోకపోవడంతో, విసిగిపోయిన యువత స్వచ్ఛందంగా రంగంలోకి దిగారు. ఉప్పరి గోతుల ప్రధాన ఘాటీ రహదారి పూర్తిగా గోతులమయమై ప్రయాణానికి నరకంగా మారింది. ఇటీవలే ఒక అంబులెన్స్ ఈ గోతుల్లో చిక్కుకుపోవడంతో రోగి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండా, ఒక ట్రాక్టర్ లోయలో పడటం, ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు తృటిలో ప్రమాదం నుండి తప్పించుకోవడం వంటి సంఘటనలు స్థానికులను భయాందోళనకు గురిచేశాయి. ఈ రహదారి సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో, “మా ప్రాణాలు మేమే కాపాడుకుంటాం” అంటూ ఉప్పరిగోతులు గ్రామ యువత నడుం బిగించారు. ప్రభుత్వ నిధుల కోసం వేచి చూడకుండా, తమలో తామే చందాలు వేసుకుని, సొంత ఖర్చులతో రెండో రోజు కూడా గోతులను పూడ్చే కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ శ్రమదాన కార్యక్రమంలో కె.నరసింహులు, పడాల సునాధర్, బి.గోపాల్, వి.రవి, వి.రామకృష్ణ, వి.రాజు, జి.మహేష్ బాబు, పి.మన్మధ, ఇతర యువకులు పాల్గొన్నారు. 'ఐ టీ డి ఏ అధికారులు మరియు ఇంజనీరింగ్ విభాగం కనీస చర్యలు లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గిరిజన ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారుల వైఖరిని నిరసిస్తు,తక్షణమే శాశ్వత రోడ్డు నిర్మించకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం” అని స్థానిక గిరిజన యువత డిమాండ్ చేశారు.

మాతృభాషలో విద్యాబోధన పునరుద్ధరించాలి : ఎపిటిఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-కురుపాం : మాతృభాషలో విద్యాబోధన పునరుద్ధరణ చేయాలని ఉమ్మడి జిల్లా ఎపిటిఎఫ్ గౌరవ అధ్యక్షుడు బంకురు జోగి నాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఎపిటిఎఫ్ నాయకులు మజ్జి ఉపేంద్ర, ఆకుల జగదీష్ తో కలిసి మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల్లో మాతృబాషలోనే భోధన జరుగుతున్న ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఆంగ్లంలో జరుగుతుందన్నారు. 2011లెక్కలు ప్రకారం భారతదేశంలో 19500 ప్రాంతీయ బాషలు ఉన్నాయని తెలిపారు. భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్, సెక్షన్22 ప్రకారం ప్రాంతీయ బాషలు అధికార బాషలు గా గుర్తింపు పొందాయని 2008 లో తెలుగు బాషను క్లాసికల్ లాంగ్వేజ్‌గా గుర్తించటం జరిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యాభోధన మాతృభాషలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

గిరిజన విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

విశాలాంధ్ర - బెలగాం : గుమ్మలక్ష్మీపురం మండలం దొరజమ్ము గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న టి. అవీష్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, అధ్యక్షులు తాడంగి సాయిబాబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన సంక్షేమ విద్యార్థుల మరణాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఇంటికి వెళ్ళిన ఒక్క రోజులో మృతి చెందటానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా, బాధ్యత లేకుండా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూచీకత్తు సంస్కృతి ఏంటని ప్రశ్నించారు. మృతి చెందిన

గిరిజన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం లను నియమించాలని వారు డిమాండ్ చేశారు.

గిరిజన విద్యార్థుల 'ముస్తాబు'

డోకిశీల ఆశ్రమ పాఠశాలలో ఆదర్శం

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: కలెక్టర్ నూతనంగా చేపట్టిన ముస్తాబు కార్యక్రమం విద్యార్థుల్లో ఎంతగానో మార్పు తీసుకువచ్చింది. అనారోగ్యంతో బడి మానేసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. విద్య అభ్యస ముగిసిన తర్వాత పాఠశాల విద్యార్థులు భోజన వేల ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చేతులు కాళ్లు శుభ్రం చేసుకుని వారి వారి భోజనం పళ్ళాలను శుభ్రంగా ఉంచడం ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తుంది. గిరిజన విద్యార్థుల అయినప్పటికీ వారి యొక్క పరిశుభ్రత చూసి ఆశ్చర్యానికి గురికాక తప్పదు. ప్రతి విద్యార్థి క్రమ పద్ధతిలో కొళాయి వద్దకు వచ్చి శుభ్రంగా కాలు చేతులను సబ్బుతో కడుక్కొని భోజనం పర్యాయలను శుభ్రపరచుకోవడం ఆ తర్వాత భోజనానికి సిద్ధపడటం ఇదంతా ఇటీవల జిల్లా కలెక్టర్ చేపట్టిన ముస్తాబు కార్యక్రమంలో భాగంగానే చెప్పుకోవాలి. ఒక చిన్న ఆలోచన అనూహ్య ప్రభావం చూపుతుంది. ఒక్కోసారి ఎంతోమందికి ఆదర్శప్రాయమవుతుంది. పేద విద్యార్థుల కోసం వినూత్న ఆలోచనతో చేపట్టిన చిరు ప్రయత్నం మొత్తం రాష్ట్రం దృష్టిని ఆకర్షించింది. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి అభినందనలు అందుకునేంత వరకు వెళ్లింది. అంతేనా...ఈ ప్రయత్నం ఇప్పుడు అన్ని ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లలో ఒక విధానంగా అమలయ్యేంత దాకా వెళ్లింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో జిల్లా కలెక్టరు ప్రారంభించిన ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ముస్తాబు కార్యక్రమం డోకి శీల గిరిజన ఆశ్రమ పాఠశాలలో అమలవుతున్న తీరు ఎంతోమందికి స్ఫూర్తిదాయకమనే చెప్పాలి.

విద్యార్థుల్లో మార్పుతెచ్చాం : హెచ్ఎం బాబురావు

ముస్తాబు కార్యక్రమం అమలు ద్వారా పేద విద్యార్థుల్లో మంచి మార్పును సాధించామని, జిల్లా కలెక్టరు ప్రభాకర్ రెడ్డి ఆలోచన సత్ఫలితాలు ఇచ్చిందని పాఠశాల హెచ్ఎం బాబురావు అభిప్రాయపడ్డారు. జిల్లాలో విద్యార్థులంతా చాలా వరకు గిరిజనులు, దళితులు, పేద వర్గాలకు చెందినవారే. వీరిలో చాలా వరకు పరిశుభ్రతపై అవగాహన ఉండదు. చాలా మంది బడికి ఉదయాన్నే నిద్ర లేచి బ్రష్ చేసుకోకుండా, ముఖం కడుక్కోకుండా, దుస్తులు మార్చుకోకుండా అలాగే వచ్చేస్తుంటారు. కనీసం చేతులు కూడా కడుక్కోకుండా భోజనం చేయడానికి వస్తుంటారు. అలాగే మురికి చేతులతో అన్నం తినేస్తుంటారు. ఫలితంగా చాలా మంది విద్యార్థులు రోగ పీడితులై బడికి దూరమవ్వాల్సిన పరిస్థితులు ఉండేవి. ఈ పరిస్థితిలో మార్పు తేరవాలని సంకల్పించి ముస్తాబు కార్యక్రమాన్ని తమ పాఠశాలలో పగడ్బందీగా ప్రతిరోజు దినచర్యలో భాగంగా నిర్వహిస్తున్నామని వివరించారు. బడిలో, హాస్టల్లో భోజనానికి వచ్చే ప్రతి విద్యార్థి ముందుగా చేతులు శుభ్రంగా కడుక్కుని వస్తేనే భోజనం వడ్డించాలనే నిబంధన

పెట్టాం. ప్రతి విద్యార్థి చేతులను నిశితంగా పరిశీలించి, విద్యార్థి చేతులు శుభ్రంగా ఉంటే భోజనం వడ్డించేలా చేశాం. అపరిశుభ్రంగా, చేతులు కడుక్కోకుండా వచ్చిన విద్యార్థికి అక్కడే ఒక బకెట్‌లో నీళ్లు, సోపు, అద్దం, దువ్వెన, గోళ్లు కత్తిరించుకోవడానికి ఒక నెయిల్ కట్టర్ ఏర్పాటు చేశాం. మురికి చేతులతో వచ్చిన విద్యార్థి ముందుగా బకెట్ వద్దకు వెళ్లి సోపుతో చేతులు శుభ్రంగా కడుక్కుని వచ్చిన తర్వాతే భోజనం వడ్డించేలా చర్యలు తీసుకున్నాం. ఇది చాలా మంచి ఫలితాలు వచ్చాయి. దీంతో మరో అడుగు ముందుకేసి ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించాం. ఉదయాన్నే బడికి ఎవరైతే విద్యార్థులు ముఖం కడుక్కోకుండా, బ్రష్ చేసుకోకుండా, యూనిఫాం దుస్తులు మార్చుకోకుండా, స్నానం చేయకుండా, తల దువ్వుకోకుండా వస్తారో అలాంటి వారికి బడిలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. అలాంటి విద్యార్థి అక్కడే బ్రష్ చేసుకని శుభ్రంగా ముఖం కడుక్కునేలా, స్నానం చేసి దుస్తులు మార్చుకునేలా ఏర్పాట్లు చేశాం. విద్యార్థి శుభ్రంగా నీట్‌గా తయారై వచ్చిన తర్వాతే తరగతి గదిలోకి అనుమతించేలా చేశాం. ఇది విద్యార్థుల అలవాట్లలోనూ, వారి క్రమశిక్షణలోనూ గణనీయమైన మార్పు తీసుకొచ్చిందని డిప్యూటీ వార్డెన్ రమేష్ తెలిపారు.

ఘనంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలో పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామమోహన నాయుడు 38వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన అభిమాని రేవల్ల రామమూర్తి నాయుడు ఆధ్వర్యంలో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఆర్) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (బీసీ) అంగన్వాడి కేంద్రాలకు చెందిన 160 మంది విద్యార్థినీ విద్యార్థులకు అట్టలు నోటు పుస్తకాలు పెన్నులు పెన్సిళ్లు జామెట్రీ సెట్ అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే రాజకీయ అరంగేట్రం చేసి రాజకీయానికే వన్నె తెచ్చి తండ్రికి తగ్గ తనయునిగా నిరూపించుకున్న ఏకైక వ్యక్తి రాము మోహన్ నాయుడు అని అన్నారు ముఖ్యంగా వెనుకబడ్డ జిల్లాలైన శ్రీకాకుళం విజయనగరంజిల్లాలకు జాతీయస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చిన నాయకుడని అన్నారు. అనంతరం ఆయన వీరాభిమాని కొండా బత్తుల కుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారు అవసరంలో ఉన్నవారు ఆయన వద్దకు వెళ్లిన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి ఆదుకున్న గొప్ప నాయకుడని కొనియాడారు. అటువంటి ఉత్తమ నాయకుడి జన్మదిన వేడుకలు జరుపుకోవడం గొప్ప ఆనందాన్ని అనుభూతిని కలిగిస్తుందని కుమార్ ఇటువంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలని రాష్ట్రానికి అటు దేశానికి ఉత్తమ సేవలు అందించి కీర్తి ప్రతిష్టలు పొందాలని అన్నారు ఈ కార్యక్రమంలో పెద్ద బుడ్డిదడి నీటి సంఘం అధ్యక్షులు రౌతు శశిభూషణరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ కర్రీ నారం నాయుడు (నారాయణరావు) పడాల వెంకటరమణ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి: ఎంపీడీవో

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: ప్రణాళిక బద్ధంగా చదువుకుని సతశాతం ఉత్తీర్ణత సాధించుకోవాలని ఎంపీడీవో సత్యం అన్నారు. మండల పరిధిలో నడుస్తున్నటువంటి ఎం జె పి ఏ బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారం నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన 100 రోజుల ప్రణాళిక ప్రకారం ప్రతి ఒక్కరూ చదువుకొని మంచి ఫలితాలు సాధించి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని అన్నారు. మానసిక ఒత్తిడి భయాందోళనకు గురికాకుండా పరీక్షలను ధైర్యంగా రాసుకొని విజయం సాధించాలని విద్యార్థినిలకు సూచించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని విద్యార్థినిలు ముస్తాబు కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా అలవాటు చేసుకోవాలని అలాగే ఎటువంటి సందేహాలు ఉన్న స్టడీ అవర్ లో వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఘనంగా జరుగుతున్న ధనుర్మాసపూజలు

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని సుమిత్రాపురం గ్రామంలో ధనుర్మాస పూజలను ఘనంగానిర్వహిస్తున్నారు. మూడురోజులక్రితంప్రారంభమైన ధనుర్మాసపూజలు జనవరి 14వరకు జరుగుతాయని, గోదాదేవి కళ్యాణంతో ముగుస్తాయన్ని తెలిపారు. ప్రతిరోజు గ్రామంలోని గోవిందమాల భరించినభక్తులు, గ్రామస్తులు కలిసి వేకువజామున మేలుకొలుపు కార్యక్రమాన్నిభక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు రౌతు వేణుగోపాల నాయుడు, కమిటీ సభ్యులు తెలిపారు. దీనివలన ప్రజల్లో ఆధ్యాత్మికత పెరగడంతోపాటు భక్తి పెరుగుతుందన్నారు.

ఘనంగా కింజరాపు రామ్మోహన్ నాయుడు గారు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర- సీతంపేట: తెలుగుదేశం పార్టీ పాలకొండ నియోజకవర్గ ఇన్చార్జి పడాల భూదేవి ఆధ్వర్యంలో పాలకొండ లో మండల కన్వీనర్ గండి రామినాయుడు ఆధ్వర్యంలో కేంద్ర పౌర విమాన శాఖ మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు చేశారు. అనంతరం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేసారు. కార్యక్రమంలో, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు మజ్జి జయశంకర్, గండి రవితేజ, నీటి సంఘం అధ్యక్షులు చెబోదుల. లక్ష్మీనారాయణ, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర-పార్వతీపురంరూరల్: మండలంలోనిబుచ్చింపేట బిడోకి సెల గ్రామాల మధ్య ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మార్గంలో గల మలుపు వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరగడం, ఆటోలు బోల్తాపడడం వంటి సంఘటనలు గతంలో జరిగాయి. దీంతో ప్రమాదకర మలుపు వద్ద ఆటో డ్రైవర్ల చొరవతో ఆలయ నిర్మాణం చేపట్టారు అప్పటినుంచి ప్రమాదాలు సంభవించలేదు దీంతో ప్రతి ఏటా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ ఘనంగా నిర్వహించే ప్రత్యేక పూజలు చేశారు . గురువారం ఆలయ వార్షికోత్సవ వేడుకలు డోకి సేల ఆటో స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగాయి .ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించి, ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులకు పంపిణీ చేశారు.

కలెక్టర్ ముస్తాబు కార్యక్రమంను ప్రశంసించిన సీఎం

కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డిలు

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకరరెడ్డి వినూత్న ఆలోచనతో ప్రవేశపెట్టిన జిల్లాలో అమలు చేసిన "ముస్తాబు" కార్యక్రమం తనను ఎంతో ఆకర్శించిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతి సచివాలయంలో గురువారం రెండోరోజు కలెక్టర్ల సదస్సులో చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డిను ప్రశంసించి కార్యక్రమం గూర్చి వివరించారు.అక్కడ విద్యార్థులను తాను చూసానని, విద్యార్థులే కలెక్టర్ తెచ్చిన "ముస్తాబు" కార్యక్రమం చాలాబాగుందని చెప్పే పరిస్థితికి వచ్చారని కితాబిచ్చారు. చాలామంది ఏదైనా పనిచేయమంటే డబ్బులేవీ అని అడుగుతున్నారు, కానీ నిధుల్లేకుండానే అద్భుతమైన కార్యక్రమాలు చేయవచ్చని, దీనికి ఉదాహరణ ముస్తాబు కార్యక్రమమని అన్నారు. వినూత్న ఆలోచనలే ముఖ్యమని, అభివృద్ధి అంటే కేవలం నిధుల కేటాయింపు మాత్రమే కాదని, వినూత్న ఆలోచనలు మరియు ఉత్తమ విధానాలతో సంపదను సృష్టించవచ్చని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.సింపుల్ ఇన్నోవేషన్ ఐడియాలతో ప్రభావం ఎక్కువ ఉంటుందన్నారు. అమరావతి సచివాలయంలో రెండో రోజు జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొని, వినూత్న కార్యక్రమాలతో ముందుకు వెళుతున్న జిల్లా కలెక్టర్లను సీఎం అభినందించారు. ఈ సందర్భంగా మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర రెడ్డిని సీఎం ప్రశంసిస్తూ, ఇటువంటి వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు పిలుపునిచ్చారు. మన్యం జిల్లా మాదిరిగా 'ముస్తాబుకార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 79 లక్షల మంది విద్యార్థులకు చేరేలా అమలు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఇది అమలు చేస్తే, చిన్నారులకు అలవాటుగా మారుతుందని, అప్పుడు వాళ్ల ఇళ్ల పరిసరాలు కూడా బాగుపడతాయని, తద్వారా సుమారు 2 కోట్ల మంది కుటుంబ సభ్యులలో సామాజిక మార్పు వస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పార్వతీపురం మన్యంలో"ముస్తాబు కార్యక్రమం అమలును వివరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందించటమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించామని, తద్వారా పాఠశాల పరిసరాలు కూడా శుభ్రంగా మారుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల హాజరు కూడా గణనీయంగా పెరుగుతోందని, రోగాల బారిన పడిన విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిందని వివరించారు. అనంతరం ముస్తాబు'కార్యక్రమంపై రూపొందించిన వీడియోను కలెక్టర్ ప్రదర్శించగా జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు.

నవదుర్గ మైనింగ్ అనుమతులు ఇవ్వాలి

జాయింట్ కలెక్టర్ సమక్షంలో అధికమంది ప్రజలు ఆమోదం
ప్రజా నివేదికను హై కమాండ్ కు పంపిస్తాం
జెసి యశ్వంత్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర- పాచిపెంట: రోడ్డు మెటల్ బిల్డింగ్ స్టోన్ ను వెలికి తీసేందుకు 531 సర్వే నెంబర్లో 14.403 హెక్టార్లలో నెక్కంటి శ్రీనివాసరావుకు అనుమతులు ఇవ్వాలని జీగిరాం సర్పంచ్ అల్లు శుభాషిణి, పనుకు వలస సర్పంచు చెల్లూరి సీతారాం, ఎంపీటీసీ చెల్లూరి లక్ష్మి పలువురు మాజీ సర్పంచులు ఎన్జీవోలు, స్థానిక ప్రజలు జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, పొల్యూషన్ ఈ ఈ తనూష, మైనింగ్ శాఖ అధికారి సమక్షంలో పెద్ద ఎత్తున ప్రజలు ఆమోదం తెలిపారు. గురువారం నాడు పాచిపెంట మండలం పనుకు వలస గ్రామం సమీపంలో జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ కార్యక్రమానికి పనుకువలస,కందిరి వలస,కోస్ట్ వలస, పెద చీపురు వలస, గుంటమామిడివలస,జీగిరామ్, మంచాడ వలస గిరిజన గ్రామాల ప్రజలు హాజరయ్యారు. నవదుర్గ మైనింగ్ ఇన్ఫ్రాకు జీగి రాం దగ్గరలో 531 సర్వేనెంబర్ లో క్వారీ నిమిత్తం అనుమతులు ఇవ్వాలని శ్రీనివాసరావు దరఖాస్తు చేసుకున్నందుకు మీ అభిప్రాయాలు చెప్పాలని ఆయన ప్రజలకు వెల్లడించారు. ముందుగా పనుకు వలస సర్పంచు సీతారాం మాట్లాడుతూ క్వారీ వలన గత రెండు దశాబ్దాలుగా సుమారుగా 700 కుటుంబాలుకు జీవనోపాధి కలుగుతోందని ఎవరో ఫిర్యాదు చేసినంత మాత్రాన మా మా జీవితాలతో ఆడుకోవద్దని వెంటనే నెక్కంటి శ్రీనివాసరావుకు క్వారీ అనుమతులు ఇవ్వాలని కోరారు. అలాగే ఎంపీటీసీ లక్ష్మి, జి గ్రామ్ సర్పంచ్ అల్లు సుభాషిని, కొంతమంది స్థానికులు, ఎన్జీవోలు, రాజకీయ నాయకులు, ప్రజలు వేదికపై మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి ప్రభుత్వం నిర్ణయించిన సేవా కార్యక్రమాలు పొల్యూషన్ నిర్మూలనకు చెట్లు నాటడం, రహదారిపై వాటర్ సప్లై చేయడం, నేలకోసారి హెల్త్ క్యాంపులో నిర్వహించడం వంటి సంక్షేమ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, గ్రంథాలయము, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఎన్జీవో వక్తలు సభ ముఖంగా నవదుర్గ యాజమాన్యానికి సూచనలు సలహాలు ఇచ్చారు. ఒకరు ఇద్దరు తప్ప మిగతా జనం నవదుర్గ మైనింగ్ ఇన్ఫ్రాకు అనుమతులు ఇచ్చి మా పరిసర ప్రాంతాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కృషి చేయాలని జాయింట్ కలెక్టర్కు స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నవదుర్గ మైనింగ్ ఇఫ్రా యజమాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి ఉంటానని కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటామని, అవసరమైనప్పుడు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని, సమీప ప్రజలకు అందుబాటులో ఉండి సేవా కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ వేదికపై మాట్లాడిన ప్రతి ఒక్క వ్యక్తి అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తదుపరి నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటుందని ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ ముగించారు.

వినియోదారులు చట్టంపై అవగాహన అవసరం

విశాలాంధ్ర-కొమరాడ : ప్రతి ఒక్క వ్యక్తికి అవగాహన అవసరం అధ్యక్షులు పెంటపాటి సూర్యరావు ఆధ్వర్యంలో గురువారం వస్తువులకొనే ప్రతి ఒక్కరు కూడా విద్యార్థులకు సామాన్య ప్రజలకు వినియోదారులు చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని గురువారం కోటిపాం జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు వినియోగదారుల సంఘం ఆహ్వాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా సర్పంచ్ సుంకర సుగుణ మాట్లాడుతూ మనం కొనే వస్తువుపై విద్యార్థులకు ప్రతి ఒక్కరికి ఎమ్మార్పీ వస్తువులు అధిక ధరలలో అమ్మితే వెంటనే సంబంధించిన శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.శ్రీనివాసరావు నల్ల మధుసూదన్ గొర్లి అప్పలరాజు బోటు రామకృష్ణ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బర్త్ వెయిటింగ్ హోమ్ కేంద్రాన్ని పరిశీలించిన ప్రాజెక్ట్ అధికారి

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని 'బర్త్ వెయిటింగ్ హోమ్' సెంటర్‌ను జాయింట్ కలెక్టర్ ఇంచార్జ్ ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి బుధవారం సందర్శించారు. గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో సుమారు 11 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల నుండి వచ్చే గర్భిణీలకు ప్రసవానికి ముందు అన్ని సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ఎక్విప్మెంట్ పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారిణి డాక్టర్ కె.వి.ఎస్. పద్మావతి, ఆస్పత్రి ఆర్ఎంఓ డా. కె. శ్యామల, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా జిల్లా అందత్వ నివారణ సంస్థ పర్యవేక్షణలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్యర్యంలో గురువారం వీరఘట్టం మండలం వండవ గ్రామంలో శ్రీ శిరిడి సాయి బాబా ధ్యాన మందిరం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం లో 310 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 68 మందికి కంటి ఆపరేషన్ కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి ఈరోజు తరలించి రేపు ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి డా. జీరు నగేష్ రెడ్డి తెలిపారు. హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో 150 మందికి కంటి అద్దములు తయారుచేసి తక్షణమే ఉచితంగా అందజేయడం జరిగిందని డా. నగేష్ రెడ్డి తెలిపారు. హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఫైనాన్స్ వి. ప్రశాంత్ జ్యోతి వెలిగించి శిబిరాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో వండవ శ్రీ షిరిడి సాయినాథుని సేవ ఆత్మకుడు సింహాచలం, శంకర్ ఫౌండేషన్ డీజీఎం వి. రమేష్ కుమార్, నేత్ర వైద్యులు డాక్టర్ గౌతమి, శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ అప్పలరాజు, క్యాంపు కో ఆర్డినేటర్ వెంకటరమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కామ్రేడ్ వినోద్ మిశ్రా 27వ వర్ధంతి

విశాలాంధ్ర-బెలగాం : సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి అమరులు కామ్రేడ్ వినోద్ మిశ్రా 27వ వర్ధంతి సందర్భంగా గురువారం పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జిల్లా ఇంఛార్జి బొడ్డు వాసుదేవరావు వినోద్ మిశ్రా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ దేశంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ నాయకత్వంలో పెచ్చు మీరుతున్న మతతత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఇదే కామ్రేడ్ వినోద్ మిశ్రా కు ఇచ్చిన సరైన నివాళి అని అన్నారు. అన్ని రంగాల్ని కాసాయికరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేస్తున్న మోడీ విధానాలను ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలన్నారు. ప్రజల ప్రజాస్వామ్య హక్కుల్ని కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను, ఓటు హక్కును తొలగిస్తున్న ఎస్ఐఆర్ లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పెనుగుర్తి సంగం మాట్లాడుతూ పార్లమెంట్ లో ఉపాధి హామీ చట్టానికి బదులుగా తీసుకొస్తున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీలి మిషన్ పథకాన్ని వెంటనే నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసిటియు నాయకులు ఎ. దామోదర్, ఎం. వెంకటరమణ, రామారావు, హెచ్. భాస్కరరావు, ఎం. సుబ్బన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో పి.ఆర్.సి టీమ్ సభ్యులు పర్యటన

విశాలాంధ్ర-కురుపాం : భారత ప్రభుత్వం జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ద్వారా "జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం అమల తీరును పరిశీలన కొరకు కేంద్రం నుంచి పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ టీమ్ సభ్యులు డాక్టర్ రమణ యద్ల మరియు డాక్టర్ చీపురుపల్లి పాదాలు పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించారు. ఈమేరకు జిల్లా ఎన్.సి.డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు తో కలిసి జిల్లాలో సీతంపేట ప్రాంతీయ ఆసుపత్రి, కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం లను గురువారం సందర్శించారు. ముందుగా ఆసుపత్రి సూపరిండెంట్స్ , స్పెషలిస్ట్ వైద్యులతో సమీక్షించి మానసిక ఆరోగ్య కార్యక్రమాలు, అందుతున్నటువంటి మానసిక వైద్య సేవలు మరియు సిబ్బంది పనితీరును గురించి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. "డిస్టిక్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ ద్వారా అందుతున్న మానసిక వైద్య సేవలు గురించి వివిధ అంశాలపై మాట్లాడటం జరిగింది. ఆసుపత్రిలో వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మానసిక ఆరోగ్య సమస్యలతో ఉన్న వారిని సకాలంలో గుర్తించి తగు చికిత్సా,పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సీతంపేట కెజిబివి పాఠశాలను సందర్శించి మెంటల్ హెల్త్ కార్యక్రమాలపై సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారా అని విద్యార్థుల ను అడిగి తెలుసుకుని, మానసిక ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీతంపేట ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.బి.శ్రీనివాసరావు,కురుపాం సూపరిండెంట్ ఇంచార్జి డా సునీల్ కుమార్, స్పెషలిస్ట్ వైద్యులు,సైకియాట్రిక్ సోషల్ వర్కర్ కృష్ణారావు,ఎన్.సి.డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుల సమస్యలు పరిష్కరించండి

గుంటూరు రాయగడ ఎక్స్ ప్రెస్ టైమింగ్స్ మార్చాలి
పార్వతీపురం స్టేషన్లో రెండు మూడు ప్లాట్ఫామ్ వంతెన వెడల్పు చేయాలి
రైల్వే స్టేషన్లో లిఫ్ట్ ఏర్పాటు చేయాలి



విశాలాంధ్ర - బెలగాం : రైల్వే ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలని రైల్వే ఎడిఆర్ఎం ను భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు, నియోజకవర్గ చైర్మన్ సిరిసిపల్లి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు కోలా కిరణ్ కుమార్, సాలూరు నియోజకవర్గం గేదెల రామకృష్ణ, దేవుపల్లి చిరంజీవి తదితరులు పార్వతీపురం రైల్వే స్టేషన్ లో అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఈ. శాంతారామ్ ను కలిసి మన్యం జిల్లా రైల్వే ప్రయాణికులు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు రాయగడ ఎక్స్ప్రెస్ టైమింగ్స్ వలన పార్వతీపురం మన్యం జిల్లా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ రైలు విజయవాడ రాత్రికి చేరుకోవడంతో ప్రయాణికులు రైల్వేస్టేషన్లో పడిగాపులు కాసి తెల్లారాక విజయవాడ పట్టణంలోకి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. అదే రైలు విజయవాడ తెల్లవారి వెళ్ళినట్లు ఉంటే ప్రయాణికులు రైలు దిగిన వెంటనే పట్టణంలోకి వెళ్లే అనుకూల పరిస్థితి ఉంటుందన్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి ఆరేళ్ల సమయాన్ని ప్రయాణికులకు అనుకూలంగా మార్చాలన్నారు. అలాగే పార్వతీపురం రైల్వే స్టేషన్ లో లిఫ్ట్ సదుపాయం కల్పించాలన్నారు. వృద్ధులకు వీల్ చైర్ సదుపాయం కల్పించాలన్నారు. రెండు మూడు ప్లాట్ ఫామ్ ల నుండి వచ్చే మెట్ల దారి ఫ్లైఓవర్ ఇరుగ్గా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని సందర్భాల్లో తొక్కిసలాట జరుగుతుందన్నారు. అలాగే తాగునీరు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు, టౌన్, బెళగాం రెండు రైల్వేస్టేషన్లో ప్రయాణికులకు సమకూర్చాలన్నారు. సాలూరు విశాఖపట్నం రైలు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే ట్రైన్ రన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. క్రిస్టమస్ సంక్రాంతి పండగలను దృష్టిలో ఉంచుకొని విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ తదితర పట్టణాల నుండి పార్వతీపురానికి ప్రత్యేక రైళ్లు నడపాలన్నారు. రైల్వే స్టేషన్లలో కోచ్ పొజిషన్ తెలిపే డిస్ప్లేలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా వినతి పత్రాన్ని అందజేశారు.

అభివృద్ధి కార్యక్రమాలు శాంతిభద్రతల గూర్చి వివరించిన కలెక్టర్, ఎస్పీలు



విశాలాంధ్ర-పార్వతీపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించబడిన ఐదవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి,జిల్లా ఎస్పీ శ్రీ ఎస్.వి. మాధవ్ రెడ్డి లు పాల్గొన్నారు.రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు మరియు శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా నిర్వహించిన ఈసదస్సులో జిల్లాకు సంబంధించిన పలు కీలక అంశాలపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు చర్చించారు.

మోడీ విధానాలను ముక్త కంఠంతో వ్యతిరేకంచాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: మోడీ విధానాలను ప్రజలందరూ ముక్త కంఠంతో వ్యతిరేకించాలని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా ఇంచార్జ్ బొడ్డు.వాసుదేవరావు అన్నారు. సీపీఐ (యం.ఎల్) పూర్వ ప్రధాన కార్యదర్శి అమరులు కామ్రేడ్ వినోద్ మిశ్రా 27వ అమరత్వ దినం సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర కమిటీ సభ్యులు పి. సంగం ఆధ్వర్యంలో,పార్టీ జిల్లా ఇన్చార్జ్ బొడ్డు వాసుదేవరావు వినోద్ మిశ్రా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు, ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ ఈరోజు దేశంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ నాయకత్వంలో పెచ్చు మీరుతున్న మతతత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు, ఇదే కామ్రేడ్ వినోద్ మిశ్రా కు ఇచ్చిన సరైన నివాళి అని అన్నారు అన్ని రంగాల్ని కాసాయికరణ, ప్రైవేటీకరణ, కార్పొరేట్ ఈకరణ చేస్తున్న మోడీ విధానాలను ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని అన్నారు. ప్రజల, ప్రజాస్వామ్య హక్కుల్ని కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పెనుగుర్తి సంఘం మాట్లాడుతూ, పార్లమెంట్లో ఉపాధి హామీ చట్టానికి బదులుగా తీసుకొస్తున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీలి మిషన్ పథకాన్ని వెంటనే నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసిటియు నాయకులు ఏ. దామోదర్, ఎం వెంకటరమణ, రామారావు, హెచ్భస్కరరావు ఎం సుబ్బన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.